# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 42, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) గురువారం -01 - మే - 2025

### పాక్ కు విడిచే బదులు మాకు తాగు నీళ్లివ్వండి..
## పంజాబ్ కు హర్యానా సీఎం విజ్ఞప్తి



తాగునీటిపై ఇరు రాష్ట్రాల మధ్య ముదురుతున్న వివాదం

భాక్రా నంగల్ ప్రాజెక్టు నుంచి నీరివ్వాలని సైనీ డిమాండ్

డ్యామ్ ఖాళీ చేయకపోతే నీరు పాకిస్థాన్ కు వెళ్తుందని హెచ్చరిక

హర్యానా వాదనలను ఖండించిన పంజాబ్ సీఎం భగవంత్ మాన్

### భారత్ దాడి చేస్తుందన్న పాక్..
## రంగంలోకి ఐక్యరాజ్య సమితి



ఇటు జైశంకర్ కు, అటు పాక్ ప్రధానికి ఐరాసా చీఫ్ ఫోన్ కాల్

పహల్గామ్ దాడిని ఖండించిన ఆంటోనియో గుటెర్రస్

ఉద్రిక్తతలను తగ్గించేందుకు మధ్యవర్తిత్వానికి సిద్ధమని ప్రకటన

### సింహాచలం దుర్ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి..
## మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటన



సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవంలో అపశ్రుతి

మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ ప్రగాఢ సానుభూతి

మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు చొప్పున పరిహారం ప్రకటన

అలాగే గాయపడిన వారికి రూ. 50వేల చొప్పున ఇస్తామన్న ప్రధాని

### అమరావతి పునఃప్రారంభానికి
# ప్రధాని మోదీ శంకుస్థాపన

- మే 2న జరిగే ఈ కార్యక్రమానికి అందరూ తరలి రావాలని సీఎం పిలుపు
- పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేస్తామన్న చంద్రబాబునాయుడు
- టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు, బూత్‌స్థాయి కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్
- అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే ఎన్డీఏ లక్ష్యమని, స్వర్ణాంధ్ర విజన్-2047తో ముందుకు వెళ్తున్నామనీ సీఎం చంద్రబాబు

**సింహాచలం ఘటనపై ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి**




**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. మే 2వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతిలో పర్యటించి రూ. 49,040 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేయనున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ మిగతా..2లో

### పవన్ కల్యాణ్ ఇప్పుడు
## ప్రాయశ్చిత్త దీక్ష చేయాలి




- సింహాచలం ఆలయం వద్ద ఏడుగురి మృతి ప్రభుత్వ వైఫల్యమేనన్న వెల్లంపల్లి
- చందనోత్సవ ఏర్పాట్లపై నిర్లక్ష్యం వహించారని మండిపాటు
- మంత్రులు అక్కడే ఉన్నా ఏర్పాట్లను పట్టించుకోలేదని విమర్శ

### గోడ కూలుతుందని ఎవరూ అనుకోలేదు...
## బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం: అనిత



- సింహాచలం ఆలయం వద్ద గోడకూలి ఏడుగురి మృతి
- తాము దర్శనం చేసుకుని వచ్చాక గోడ కూలిన ప్రమాదం గురించి తెలిసిందన్న అనిత
- అర్ధరాత్రి వర్షం పడుతున్న సమయంలో కూడా తాము ఇక్కడే ఉన్నామని వెల్లడి

**అమరావతి,:** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి చందనోత్సవం సందర్భంగా తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆలయ ప్రాంగణంలో గోడ కూలిన మిగతా..2లో

### భూదాన్ భూముల కేసులో తెలంగాణ హైకోర్టులో ఐపీఎస్ లకు చుక్కెదురు



- భూదాన్ భూముల వివాదంలో సీనియర్ ఐపీఎస్‌లు మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సౌమ్య మిశ్రా
- సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరణ
- ఐపీఎస్ అధికారుల తరపు వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం

# ఆగమైంది తెలంగాణ కాదు..
# కేసీఆర్ కుటుంబం: సీఎం రేవంత్

- 12వ శతాబ్దంలోనే సమాజంలో అనేక మార్పులకు పునాదులు వేసిన విప్లవకారుడు బసవేశ్వరుడు
- ఆయన జయంతి రోజున పదోతరగతి ఫలితాలు విడుదల చేసుకోవడం సంతోషం
- బసవేశ్వర స్ఫూర్తితోనే పంచాయతీ రాజ్ పార్లమెంటరీ వ్యవస్థను మనం తెచ్చుకున్నాం
- పాలకపక్షం తీసుకునే నిర్ణయాలలో లోపాలను ఎత్తి చూపేందుకే ప్రతిపక్షం అనే వ్యవస్థ ఉంది



**అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చ చేద్దాం రండి.**
**పదేళ్లు దోచుకున్న మీకు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు లేదు**

హైదరాబాద్, :ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం బలంగా ఉండాలని, ప్రజా సమస్యలను ప్రస్తావించకుండా ఉత్త విమర్శలు చేస్తూ కాలయాపన చేయడం కాదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన బీఆర్ఎస్‌ను, బుధవారం శ్రీమహాత్మ బసవేశ్వర జయంతోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మిగతా..2లో

### తెలంగాణ టెన్త్ ఫలితాలను
## సీఎం రేవంత్‌రెడ్డి విడుదల



ఒక్క విద్యార్థీ పాస్‌కాని స్కూళ్లు రెండు..

జూన్ 3 నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

తెలంగాణ టెన్త్ ఫలితాల్లో 92.78 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ఫీజు చెల్లింపునకు తుది గడువు మే 16గా నిర్ణయం

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

- ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం
- జన గణనలో కులగణన చేయాలని క్యాబినెట్ నిర్ణయం
- చెరకు మద్దతు ధర క్వింటా రూ. 350కు కేబినెట్ ఆమోదం
- కుల గణనను కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉన్నాయి
- కుల గణన కోసం ఎన్నో ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్న బిసి సంఘాలు




**భేటీలో ఆ ఉగ్రదాడి ఘటనకు సంబంధించి ఎటువంటి చర్చ లేకుండా భేటీ ముగిసింది. దీనిపై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎటువంటి ప్రకటన చేయలేదు. దాంతో దాడికి సంబంధించి ప్రతిచర్యలపై కేంద్రం మౌనం పాటిస్తూ ముందుకెళ్లడం కూడా వ్యూహాత్మక ఎత్తుగడగా విశ్లేషకులు భావిస్తున్నారు**

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. జనగణనలోనే కుల గణన కూడా చేయడానికి కేబినెట్ అంగీకారం తెలిపింది. వచ్చే జనాభా లెక్కల్లో కులగణనను చేరుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది జనగణన చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. దీనిలో భాగంగా జనగణనతో కలిపి కులగణన కూడా చేయడానికి నిశ్చయించింది. 2019లోనే జనగణన చేయాల్సి ఉన్నప్పటికీ కరోనా కారణంగా అప్పుడు ముందుడుగు పడలేదు. దాంతో పాటు షిల్లాంగ్-సిల్చారు జాతీయ రహదారి నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. మిగతా..2లో

# టీఎస్పీఎస్సీకి కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ
## గ్రూప్-1 అక్రమాలపై రంగంలోకి బండి సంజయ్

- భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు, తప్పిదాలు జరిగాయని అభ్యర్థుల ఆందోళన
- అభ్యర్థుల ఆందోళనను పరిగణలోకి తీసుకున్న బండి సంజయ్
- టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశంకు స్వయంగా లేఖ రాసిన కేంద్ర మంత్రి
- అభ్యర్థులు లేవనెత్తిన సందేహాలను ఆ లేఖలో ప్రస్తావించిన సంజయ్
- వారం రోజుల్లో సమగ్ర సమాచారాన్ని అందించాలని టీజీపీఎస్సీని కోరిన బండి
- ఇప్పటికే గ్రూప్ 1పై హైకోర్టులో కొనసాగుతున్న విచారణ




- టీఎస్‌పీఎస్సీ నుండి వచ్చిన సమాధానం ఆధారంగా గ్రూప్ 1 కేసులో ఇంప్లీడ్ పై నిర్ణయం తీసుకోనున్న కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ,: తెలంగాణ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో అక్రమాలు, అవినీతి ఆరోపణలతోపాటు తీవ్రమైన తప్పిదాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రంగంలోకి దిగారు. గ్రూప్ 1 పరీక్షా ఫలితాలపై టీజీపీఎస్సీ నుండి సమాచారం కోరుతూ.. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ మిగతా..2లో

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

మొదటి పేజి తరువాయి




దాంతో పాటు షిల్లాంగ్-సిల్చారు జాతీయ రహదారి నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. 22,864 కోట్ల రూపాయల ఖర్చుతో 166 కిలోమీటర్ల మేర గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫలితంగా త్రిపుర, మిజోరం, మణిపూర్, అస్సాంలోని బరాక్ వ్యాలీకి కనెక్టివిటీ పెరగనుంది. అదే సమయంలో చెరకు మద్దతు ధర క్వింటా రూ. 350కు కేబినెట్ ఆమోదం తెలిపింది. కేబినెట్ భేటీ అనంతరం మంత్రి మండలి నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

పహల్గామ్ పై నో డిస్కషన్.. ఓన్లీ సైలెన్స్

అయితే ఈరోజు జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో పహల్గామ్ ఉగ్రదాడి ఘటనకు సంబంధించి కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అంతా భావించారు. అయితే నేటి భేటీలో ఆ ఉగ్రదాడి ఘటనకు సంబంధించి ఎటువంటి చర్చ లేకుండా భేటీ ముగిసింది. దీనిపై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎటువంటి ప్రకటన చేయలేదు. దాంతో దాడికి సంబంధించి ప్రతిచర్యలపై కేంద్రం మౌనం పాటిస్తూ ముందుకెళ్లడం కూడా వ్యూహాత్మక ఎత్తుగడగా విశ్లేషకులు భావిస్తున్నారు.

కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఏమన్నారంటే..

జన గణనలో కులగణన చేయాలని క్యాబినెట్ నిర్ణయం ,వచ్చే జనాభా లెక్కల్లో కుల గణన కాలమ్ చేర్చాలని నిర్ణయం, బీహార్, బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మోడీ కీలక నిర్ణయం,కుల గణన కోసం ఎన్నో ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్న బిసి సంఘాలు,కుల గణనను కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉన్నాయి.,స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి జరిగిన అన్ని జనాభా గణన కార్యకలాపాలలో కులాన్ని చేర్చలేదు.,కుల గణన అంశాన్ని కేబినెట్‌లో పరిశీలిస్తామని 2010లో అప్పటి ప్రధాని దివంగత డాక్టర్ మన్మోహన్ సింగ్ లోక్‌సభకు హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని పరిశీలించేందుకు మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేశారు. చాలా రాజకీయ పార్టీలు కుల గణనను సిఫార్సు చేశాయి. కుల గణనకు బదులు సర్వే మాత్రమే చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఆ సర్వేనే ఎస్ఈసిసి అంటారు. కాంగ్రెస్ మరియు దాని భారత కూటమి భాగస్వామ్య పక్షాలు కుల గణనను రాజకీయ సాధనంగా మాత్రమే ఉపయోగించుకున్నాయని బాగా అర్థమైంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 246 ప్రకారం, సబ్జెక్ట్ సెన్సస్ ఏడవ షెడ్యూల్‌లోని యూనియన్ జాబితాలో 69గా జాబితా చేయబడింది. భారత రాజ్యాంగం ప్రకారం, జనాభా గణన అనేది యూనియన్ సబ్జెక్ట్. కొన్ని రాష్ట్రాలు కులాలను లెక్కించేందుకు సర్వేలు నిర్వహించాయి. కొన్ని రాష్ట్రాలు దీన్ని బాగా చేశాయి, మరికొన్ని పారదర్శకంగా రాజకీయ కోణం నుండి ఇటువంటి సర్వేలను నిర్వహించాయి. ఇలాంటి సర్వేలు సమాజంలో అనుమానాలకు తావిస్తున్నాయి. ఈ వాస్తవాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, రాజకీయాల వల్ల మన సామాజిక వ్యవస్థకు భంగం కలగకుండా చూసేందుకు, కుల గణనను సర్వేలకు బదులు పారదర్శకంగా జనాభా గణనలో చేర్చాలి. ఇది దేశం పురోగమిస్తూనే మన సమాజం యొక్క సామాజిక మరియు ఆర్థిక నిర్మాణాన్ని బలోపేతం చేస్తుంది. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీజీ నేతృత్వంలో, రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ, ఈ రోజు (30 ఏప్రిల్, 2025) రాబోయే జనాభా గణనలో కుల గణనను చేర్చాలని నిర్ణయించింది. గతంలో మా ప్రభుత్వం సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10% రిజర్వేషన్లు ప్రవేశపెట్టినప్పుడు సమాజంలోని ఏ వర్గానికి ఒత్తిడి కలిగించకుండా మన ప్రభుత్వం మన సమాజం మరియు దేశం యొక్క విలువలు మరియు ప్రయోజనాలకు కట్టుబడి ఉందని ఇది నిరూపిస్తుంది.

# ఆగమైంది తెలంగాణ కాదు.. కేసీఆర్ కుటుంబం: సీఎం రేవంత్

మొదటి పేజి తరువాయి



పాల్గొన్న ఆయన బీఆర్ఎస్‌ను, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 12వ శతాబ్దంలోనే సమాజంలో అనేక మార్పులకు పునాదులు వేసిన విప్లవకారుడు బసవేశ్వరుడు. ఆయన జయంతి రోజున పదోతరగతి ఫలితాలు విడుదల చేసుకోవడం సంతోషం. పరీక్షలు పాసైన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు. బసవన్న స్ఫూర్తితో మా ప్రభుత్వం పనిచేస్తోంది. కుల, మత, లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన అభ్యుదయవాది బసవన్న. బసవేశ్వర స్ఫూర్తితోనే పంచాయతీ రాజ్ పార్లమెంటరీ వ్యవస్థను మనం తెచ్చుకున్నాం. ప్రతీ మనిషి గౌరవంగా బతికేలా ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించాలి. పాలకపక్షం తీసుకునే నిర్ణయాలలో లోపాలను ఎత్తి చూపేందుకే ప్రతిపక్షం అనే వ్యవస్థ ఉంది. మొన్న ఒకాయన(కేసీఆర్‌ను ఉద్దేశించి..) వరంగల్ లో సభ పెట్టి కాంగ్రెస్‌ను విమర్శించిండు. వాళ్లు రజతోత్సవాలు , విజయోత్సవాలు ఏర్పాటు చేసుకుంటే ఆర్టీసీ నుంచి బస్సులు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరించింది. వరంగల్ సభలో మేం చేసిన మంచిని అభినందించి ప్రజా సమస్యలను అక్కడ ప్రస్తావించి ఉంటే నిజంగానే ప్రజలు ఆయన్ను అభినందించే వాళ్లు. ప్రభుత్వ జీతం తీసుకుంటూ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదు?. ఇన్నాళ్లుగా ఆయన ఇంట్లో నుంచి కాలు కదపకుండా జీతభత్యాలు తీసుకున్నారు.. ఇది ఏ చట్టంలో ఉంది?. ప్రతిపక్ష నాయకుడిగా రూ. 65 లక్షలు, వాహనాలు, పోలీస్ భద్రత తీసుకున్నారు. మరి ఎందుకు ప్రతిపక్ష నాయకుడిగా పని చేయకుండా ఫామ్ హౌస్‌లో పడుకున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు ఫామ్ హౌజ్‌లో పడుకుని ప్రజలకు ఏం సందేశం ఇవ్వదలచుకున్నారు?. సంక్షేమ పథకాలు ఆగిపోయాయని ఆయన మాట్లాడిండు. రైతు బంధు, ఆరోగ్యశ్రీ, ఉచిత కరెంటు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి వీటిలో ఏది ఆగిపోయింది?. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం.. ఇవేవీ మీకు కనిపించడంలేదా?. మీరు ఏ మత్తులో తూగుతున్నారో మీకే తెలియాలి. కడుపు నిండా విషం పెట్టుకుని విద్వేష పూరితప్రసంగం చేసి ప్రజల్ని రెచ్చగొట్టి ఏం చేయాలనుకుంటున్నారు? ప్రజలు విజ్ఞులు.. ఎవరేం చేశారో ప్రజలకు తెలుసు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు కేసీఆర్‌కు లేదు. పదేళ్లు ప్రజలు మెచ్చే పరిపాలన చేస్తాం. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చ చేద్దాం రండి. ఏ అంశంపైన అయినా సరే చర్చకు సిద్ధం. కాళేశ్వరం, ఉచిత బస్సు, రుణమాఫీ, రైతు బంధు, మేం ఇచ్చిన 60 వేల ఉద్యోగాలు, ఎస్సీ వర్గీకరణ, కులగణన వీటిలో దేనిపై చర్చ చేద్దాం చెప్పండి.. కేసీఆర్. చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం. కేసీఆర్ మాటల్లో.. కళ్ళల్లో విషం కనిపిస్తోంది. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ విలన్ ఎలా అవుతుంది?. పదేళ్లు దోచుకున్న మీకు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు లేదు. ఆగమైంది తెలంగాణ కాదు.. కేసీఆర్ కుటుంబం. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రకు వెళ్లినట్లు కేసీఆర్ వరంగల్ వెళ్లారు. ఆయన వరంగల్ వెళ్లి పాపాలు కడిగేసుకున్నానుకుంటున్నారు.. కానీ అక్కడికి వెళ్లి అబద్ధాలు మాట్లాడి ఇంకో తప్పు చేశారు. వరంగల్ సభలో నా పేరు కూడా పలకలేకపోయారు బసవేశ్వరుడి స్ఫూర్తితో 'రాష్ట్ర ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి' అనే విధానంతో మా ప్రభుత్వం ముందుకు వెళుతున్నాం. ప్రజలకు మేలు చేయడమే మా పని ప్రచారం చేయాల్సింది మీరే. మీరే మా బ్రాండ్ అంబాసిడర్లు" అని రేవంత్ అన్నారు.

# గోడ కూలుతుందని ఎవరూ అనుకోలేదు... బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం: అనిత

అమరావతి: సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి చందనోత్సవం సందర్భంగా తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆలయ ప్రాంగణంలో గోడ కూలిన దుర్ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. హోంమంత్రి వంగలపూడి అనిత స్వయంగా సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించడంతో పాటు మృతుల కుటుంబాలకు భారీ పరిహారాన్ని ప్రకటించారు. సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ దురదృష్టకర సంఘటనలో ఏడుగురు మరణించారని, వారిలో నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారని ఆమె తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చందనోత్సవానికి భక్తులు భారీ సంఖ్యలో వస్తారని ముందుగానే అంచనా వేసి, అందుకు తగిన ఏర్పాట్లు చేశామని, తాను కూడా రెండు రోజుల క్రితం ఏర్పాట్లను పరిశీలించానని అనిత చెప్పారు. "ఇది ఊహించని ఘటన. గోడ కూలుతుందని ఎవరూ ఊహించలేరు. అర్ధరాత్రి వర్షం పడుతున్న సమయంలో మేం కూడా ఇక్కడే ఉన్నాం, దర్శనం చేసుకుని బయటకు వచ్చాక ప్రమాదం గురించి తెలిసింది. వెంటనే ఇక్కడికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నాం. సహాయక చర్యల్లో ఎలాంటి జాప్యం జరగలేదు" అని తెలిపారు. గోడ కూలిన ఘటనకు దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ జరుపుతామని హోంమంత్రి స్పష్టం చేశారు. కూలిన గోడ నిర్మాణం ఎప్పుడు జరిగింది? కాంట్రాక్టర్ ఎవరు? నిర్మాణంలో నాణ్యతా లోపాలున్నాయా? అనే కోణాల్లో దర్యాప్తు ఉంటుందన్నారు. ఈ ఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని, విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. మరోవైపు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింహాచలం ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. గోడ కూలిన ఘటనపై లోతైన విచారణ జరిపేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారికి రూ. 3 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. అంతేకాకుండా, బాధితుల కుటుంబాల్లో అర్హులైన వారికి దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగావకాశాలు కల్పించాలని సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం బాధితులకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

# ఈ సందేహాలు తీర్చండి.. టీఎస్పీఎస్సీకి కేంద్ర మంత్రి లేఖ

మొదటి పేజి తరువాయి

టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశంకు ఆయన లేఖ రాశారు. అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున తనకు విజ్ఞప్తులు వెల్లువెత్తడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకన విధానం, ఫలితాల విషయంలో అనేక అక్రమాలు, అవకతవకలు, తప్పిదాలు జరిగాయని, నిబంధనల ఉల్లంఘన జరిగిందని పేర్కొంటూ గ్రూప్ 1 అభ్యర్థులు పలుమార్లు తన దృష్టికి తీసుకొచ్చిన నేపథ్యంలో.. ఆ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత టీఎస్‌పీఎస్సీ పైన ఉందని ఆయన లేఖలో పేర్కొన్నారు. ప్రధానంగా మార్కుల ప్రకటన, నోటిఫికేషన్ ఉల్లంఘన, పరీక్షా పత్రాల మూల్యాంకనంలో జరిగిన పొరపాట్లతోపాటు ఉర్దూ మీడియంలో రాసిన అభ్యర్థులకు టాప్ ర్యాంకులు రావడాన్ని ఆ లేఖలో ప్రస్తావించారు. వీటికి సంబంధించి సమగ్ర సమాచారాన్ని వారం రోజుల్లో పంపాలని ఛైర్మన్ ను కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు. మరోవైపు హైకోర్టులో గ్రూప్ 1 కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో.. టీజీపీఎస్సీ నుండి వచ్చిన సమాచారం ఆధారంగా అవసరమైతే తాను సైతం కేసులో ఇంప్లీడ్ కావాలని ఆయన నిర్ణయించారు.

బండి సంజయ్ లేఖలో కోరిన అంశాలు

1. మార్కుల ప్రకటన:UPSC తరహాలో ఎంపికైన మొత్తం 563 మంది అభ్యర్థుల పూర్తి మార్కుల జాబితాను(పేర్లతోసహా) అందించగలరు. రీకౌంటింగ్ కు ముందునాటి జనరల్ ర్యాంకింగ్ జాబితా మరియు ప్రొవిజనల్ మార్కుల జాబితా అందించగలరు. అట్లాగే నోటిఫికేషన్ యొక్క 15.2 - 15.3 నిబంధనలు ఉల్లంఘనకు కారణాలను వివరించగలరు. అభ్యర్థులకు వచ్చిన మార్కుల జాబితాను మీడియం వారీగా అందించగలరు. ప్రిలిమ్స్ - మెయిన్స్ హాల్ టికెట్ నంబర్లు, పేరు, వయస్సు, మీడియం, లింగం, కేటగిరీ, ప్రతి పేపర్‌కు సంబంధించిన మార్కులు మరియు మొత్తం మార్కులతో సహా తెలియజేయగలరు.

2. మూల్యాంకన ప్రక్రియ:

గ్రూప్ 1 పరీక్షల మూల్యాంకనానికి సంబంధించి మొత్తం దశల సంఖ్య, ప్రతి దశలో Evaluation జరిగిన రోజుల సంఖ్య, కేంద్రాలు లేదా పేపర్ వారీగా సమాచారం తెలియజేయగలరు. ప్రతిరోజు మూల్యాంకనకు ఉపయోగించిన గంటలు, మూల్యాంకనకారులకు ఇచ్చిన, మారిన సూచనలను తెలియజేయగలరు.

? పదవీ విరమణ పొందిన మూల్యాంకనకారులను ఎంపిక చేసిన ప్రమాణాలు ఏమిటి? బ్లూప్రింట్లు మీడియం స్పెసిఫిక్‌గా ఉన్నాయా లేక కేవలం ఇంగ్లీషులో మాత్రమేనా? ప్రతి పేపర్, ప్రతి మీడియంకు ప్రతి దశలో ఎంత మంది మూల్యాంకనకారులు ఉన్నారు? మూల్యాంకన సమయంలో ఉన్న సీసీ టీవి ఫుటేజ్ భద్రత స్థితి ఏమిటి? గౌరవనీయ సుప్రీం కోర్టు ఆదేశించినట్లుగా UPSC స్థాయిలో మోడరేషన్ ప్రక్రియను పాటించకపోవడానికి కారణాలను తెలియజేయగలరు.

3. హాజరు వివరాలు:

జనరల్ ఇంగ్లీష్ మరియు పేపర్లు 1- 6కి పేపర్ వారీగా, మీడియం వారీగా హాజరు వివరాలను అందించగలరు. ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానం పాటించబడిందా లేదా? పాటించకపోతే కారణాలేమిటి? నమోదు అయిన హాజరులో ఉన్న వ్యత్యాసాలకు కారణాలను తెలియజేయగలరు.

4. ఫలితాల ప్రకటనకు ముందు డేటా లీక్:

మార్చి 15, 2025న ఒక టెలిగ్రామ్ గ్రూప్‌లో 450కి పైగా మార్కులు పొందిన అభ్యర్థుల సంఖ్య (618) సోషల్ మీడియాలో పోస్టు చేయబడింది. మార్చి 30న విడుదలైన జీఆర్ఎల్ తో ఇది సమానం. సున్నితమైన డేటా లీక్‌కు బాధ్యులైన వారిపై తీసుకున్న చర్యలను తెలియజేయగలరు.



5. కోడ్ ఆధారిత మార్కుల నకిలీ లక్షణాలు:

0-50 అంకెల తేడా ఉన్న హాల్ టికెట్ నంబర్ల కలిగిన 1,500కు పైగా అభ్యర్థుల జంటలకు ఒక్కటే మార్కులు రావడం, అంకె పదాంశాల వరకు సరిపోలేదని తెలిసింది. ఇది ఒక కోడెడ్ మార్కింగ్ అల్గోరిథం ఉపయోగించారని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. UPSC, APPSC లేదా గత TGPSC పరీక్షలలో ఇలాంటి ధోరణి కనుగొనబడలేదు. దీనికి కారణాలను వివరించగలరు.

6. కేంద్రాల వారీగా అసమాన ఫలితాలు:

కోఠి ఉమెన్స్ కాలేజ్ (సెంటర్లు 18- 19) నుంచి ఎంత మంది మెయిన్స్ పరీక్ష రాశారు. వారిలో ఎంత మందికి టాప్ 500లోపు ర్యాంకులు వచ్చాయి? వివరించగలరు. అట్లాగే మిగిలిన కేంద్రాల నుండి ఎంత మంది పరీక్ష రాశారు? వారిలో ఎంత మందికి టాప్ 500లోపు ర్యాంకులు వచ్చాయి. కోఠి ఉమెన్స్ కాలేజీలో పరీక్ష రాసిన వారికే అత్యధిక ర్యాంకులు వచ్చినట్లు మా దృష్టికి వచ్చింది? దీనిపై సమగ్ర వివరాలను అందించగలరు.

7. అదనపు సమాచారం :

హాల్ టికెట్లు మరియు పరీక్ష కేంద్రాల కేటాయింపు యాదృచ్ఛికంగా జరిగిందా లేక మానవీయంగా కల్పించారా?, UPSC లో హాల్ టికెట్ నంబర్లు స్థిరంగా ఉండగా, ఇక్కడ ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్ వరకు ఎందుకు మార్పు జరిగింది?. పరీక్ష కేంద్రాల వారీగా అభ్యర్థుల కూర్చునే పథకం, పర్యవేక్షణకారుల కేటాయింపు వివరాలు. ? పరీక్ష కేంద్రాల నుంచి వచ్చిన సిసి టివి ఫుటేజ్ భద్రత స్థితి. సమాధాన పత్రాల కోడింగ్ విధానం, మరియు పేరు, జిల్లా కోడ్, పుట్టిన తేదీ వంటి వివరాలను ఎలా నిర్వహించారు?.. తదితర వివరాలను అందించాలని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశంను బండి సంజయ్ లేఖలో కోరారు.

# భూదాన్ భూముల కేసులో తెలంగాణ హైకోర్టులో ఐపీఎస్ లకు చుక్కెదురు

హైదరాబాద్, : భూదాన్ భూముల కేసుకు సంబంధించి సీనియర్ ఐపీఎస్ అధికారులు మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సౌమ్య మిశ్రాలకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించలేదు. ఈ వివాదంలో హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించాలని కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్‌ను డివిజన్ బెంచ్ తోసిపుచ్చింది. తదుపరి వాదనలను సింగిల్ బెంచ్ ముందే వినిపించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వే నంబర్లు 181, 182, 194, 195లలో గల భూదాన్ భూములను ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇతరులు అక్రమంగా పొందారనే ఆరోపణలు వచ్చాయి. ఈ అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ బిర్ల మల్లేశ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సి.వి. భాస్కర్ రెడ్డి నేతృత్వంలోని సింగిల్ బెంచ్ ఏప్రిల్ 24న కీలక ఆదేశాలు జారీ చేసింది. సదరు భూములను ఏప్రిల్ 27 నుంచి నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సంబంధిత సబ్ రిజిస్ట్రార్లను ఆదేశించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఈ ఆదేశాలను సవాలు చేస్తూ మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సౌమ్య మిశ్రాలు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై



డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. పిటిషనర్ల తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ, మహేశ్వరం మండలం నాగారంలోని సర్వే నంబర్ 194లో ఉన్నది పట్టా భూమి అని, భూదాన్ భూమి కాదని కోర్టుకు తెలిపారు. తమ వాదనలను పరిగణనలోకి తీసుకోకుండానే సింగిల్ బెంచ్ ఏకపక్షంగా ఉత్తర్వులు ఇచ్చిందని వారు వాదించారు. పిటిషనర్ కోరిన దానికంటే ఎక్కువ ఉపశమనాన్ని సింగిల్ బెంచ్ కల్పించిందని, పిటిషన్‌ను ఉపసంహరించుకోవద్దని రిజిస్ట్రీని ఆదేశించే అధికారం కూడా సింగిల్ బెంచ్‌కు లేదని వారు పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు డివిజన్ బెంచ్, సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ప్రస్తుత దశలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి వాదనలను సింగిల్ బెంచ్ ముందే వినిపించాలని ఐపీఎస్ అధికారుల తరపు న్యాయవాదులకు సూచించింది. దీంతో సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలు ప్రస్తుతానికి అమల్లోనే ఉండనున్నాయి. స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారంతో కొందరు ఉన్నతాధికారులు ఫోర్జరీ పత్రాలు సృష్టించి, రికార్డులు తారుమారు చేసి బినామీ లావాదేవీల ద్వారా భూదాన్ భూములను అక్రమంగా బదలాయించుకున్నారని పిటిషనర్ బిర్ల మల్లేశ్ తన పిటిషన్‌లో ఆరోపించారు. భూదాన్ చట్టం, తెలంగాణ భూదాన, గ్రామదాన నిబంధనలు-1965కు విరుద్ధంగా ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు తమ పేర్లతో, కుటుంబ సభ్యుల పేర్లతో భూములు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని ఆయన కోరారు.

# పాక్ కు విడిచే బదులు మాకు తాగు నీళ్లివ్వండి.. పంజాబ్ కు హర్యానా సీఎం విజ్ఞప్తి

**న్యూఢిల్లీ,:** హర్యానా, పంజాబ్ రాష్ట్రాల మధ్య నీటి పంపకాల వివాదం మరోసారి తీవ్రస్థాయికి చేరింది. తమ రాష్ట్రానికి తాగునీటిని విడుదల చేయాలని, లేదంటే భాక్రా డ్యామ్‌లోని అదనపు జలాలు పాకిస్థాన్ కు పోతాయని హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ పంజాబ్‌ను హెచ్చరించారు. వర్షాకాలంలో నీటిని నిల్వ చేసుకునేందుకు వీలుగా జూన్ లోపు భాక్రా జలాశయాన్ని ఖాళీ చేయాలని ఆయన నొక్కి చెప్పారు. "జలాశయంలో నీటిని నిల్వ చేయడానికి స్థలం లేకపోతే, అదనపు నీరు హరి-కే-పట్టన్ మీదుగా పాకిస్థాన్ కు వెళ్తుంది. ఇది పంజాబ్‌కు గానీ, దేశానికి గానీ మంచిది కాదు" అని సైనీ అన్నారు. ఈ వివాదం కారణంగా ఢిల్లీ తాగునీటి సరఫరాపై పైనా ప్రభావం పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది తమకు రావాల్సిన పూర్తి వాటా నీరు అందలేదన్నారు. గత నెల భాక్రా బియాస్ మేనేజ్‌మెంట్ బోర్డ్ హర్యానాకు విడుదల చేసిన నీటిలో 500 క్యూసెక్కులు ఢిల్లీకి, 800 క్యూసెక్కులు రాజస్థాన్‌కు, 400 క్యూసెక్కులు పంజాబ్‌కే వెళ్లాయని, దీంతో హర్యానాకు వాస్తవంగా 6,800 క్యూసెక్కులు మాత్రమే అందాయని సైనీ వివరించారు. హర్యానా డిమాండ్ మేరకు నీటిని విడుదల చేయాలని బీజేపీ ప్రభుత్వం భాక్రా బియాస్ మేనేజ్ మెంట్ బోర్డు ద్వారా పంజాబ్‌పై ఒత్తిడి తెస్తోందని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఆరోపించారు. హర్యానా ఇప్పటికే మార్చి నెలలో కేటాయించిన నీటి వాటాలో 103 శాతం వినియోగించుకుందని ఆయన పేర్కొన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య సట్లెజ్-యమునా లింక్ కెనాల్ నిర్మాణంపై వివాదం ఏళ్లుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. పంజాబ్‌లో వరి సాగు ఏప్రిల్ మే నెలల్లో ఉండదని, ఈ సమయంలో విడుదల చేసే నీరు కేవలం తాగునీటి అవసరాలకేనని సైనీ చెప్పారు. అయితే, సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన నేపథ్యంలో, చినాబ్, జీలం వంటి నదుల జలాలను ఉత్తరాది రాష్ట్రాలకు మళ్లించాలని భగవంత్ మాన్ కేంద్రాన్ని కోరారు.

# భారత్ దాడి చేస్తుందన్న పాక్.. రంగంలోకి ఐక్యరాజ్య సమితి

**న్యూఢిల్లీ,:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ తమపై సైనిక చర్యకు సిద్ధమవుతోందని పాకిస్థాన్ ప్రభుత్వం ఆరోపించింది. దీంతో ఐక్యరాజ్య సమితి రంగంలోకి దిగింది. మంగళవారం ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ ఇరు దేశాలకు ఫోన్ చేశారు. భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ లతో ఫోన్ లో మాట్లాడారు. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన గుటెర్రస్.. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు మధ్యవర్తిత్వానికి సిద్ధమని తెలిపారు. అన్ని రకాల ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ ఖండిస్తుందని, పహల్గామ్ ఘటనపై భారత్ చేస్తున్న ఆరోపణలను తిరస్కరిస్తున్నామని షరీఫ్ స్పష్టం చేశారు. ఈ ఘటనపై పారదర్శక, తటస్థ దర్యాప్తు జరపాలని, కశ్మీర్ వివాదాన్ని ఐరాస భద్రతా మండలి తీర్మానాల ప్రకారం పరిష్కరించాలని గుటెర్రస్‌ను కోరినట్లు తెలిపారు. శాంతికి కట్టుబడి ఉంటామని, అయితే సార్వభౌమాధికారాన్ని సవాల్ చేస్తే పూర్తి శక్తితో ప్రతిఘటిస్తామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, యూఎన్ సెక్రటరీ జనరల్ గుటెర్రస్‌తో జరిగిన సంభాషణ వివరాలను భారత విదేశాంగ మంత్రి జైశంకర్ వెల్లడించారు. పహల్గామ్ ఉగ్రదాడిని గుటెర్రస్ నిస్సందేహంగా ఖండించడాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. దాడికి పాల్పడిన వారిని, ప్రణాళిక రచించిన వారిని, వారికి సహకరించిన వారిని చట్ట ప్రకారం కచ్చితంగా శిక్షించాల్సిన అవసరం ఉందని ఇరువురం ఏకీభవించామని జైశంకర్ పేర్కొన్నారు. ఈ విషయంలో భారత్ దృఢ నిశ్చయంతో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ ఫోన్ కాల్స్‌ను యూఎన్ అధికార ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ ధృవీకరించారు. ఏప్రిల్ 22 నాటి ఉగ్రదాడిని సెక్రటరీ జనరల్ తీవ్రంగా ఖండించారని, చట్టబద్ధమైన మార్గాల ద్వారా బాధ్యులను గుర్తించి న్యాయం చేయాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారని తెలిపారు. ఉద్రిక్తతలు తగ్గించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి, మధ్యవర్తిత్వం వహించడానికి సెక్రటరీ జనరల్ సిద్ధంగా ఉన్నారని దుజారిక్ వెల్లడించారు.

# సింహాచలం దుర్ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి.. మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటన

**న్యూఢిల్లీ,:** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవంలో గోడ కూలి భక్తులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రధాని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు చొప్పున, గాయపడిన వారికి రూ. 50వేల చొప్పున పరిహారం ప్రకటించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సింహాచలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ. 300 టికెట్ కౌంటర్ వద్ద ఉన్న ఓ గోడ కుప్పకూలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

# తెలంగాణ టెన్త్ ఫలితాలను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల

హైదరాబాద్: తెలంగాణ టెన్త్ ఫలితాలను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులతో కలిసి సీఎం విడుదల చేశారు. ఫలితాల్లో 92.78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది కంటే ఈసారి 1.47 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. 94.26 శాతం మంది బాలికలు ఉత్తీర్ణత కాగా.. 91.32 శాతం మంది బాలురు పాసయ్యారు. అత్యధికంగా గురుకుల పాఠశాలల్లో 98.7 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ప్రైవేటు పాఠశాలల్లో 94.21 శాతం విద్యార్థులు పాసయ్యారు. ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్లను ఎస్ఎస్‌సీ బోర్డు ఇచ్చింది.

జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరుగుతాయని ఎస్ఎస్‌సీ బోర్డు ప్రకటించింది. ఫీజు చెల్లింపునకు తుది గడువు మే 16గా నిర్ణయించారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు మే 15వరకు అవకాశం కల్పించారు. ఇందుకోసం సబ్జెక్టుకు రూ.500 చొప్పున చెల్లించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున చెల్లించి రీవెరిఫికేషన్‌కు దరఖాస్తుకు అవకాశం కల్పించారు.

ఒక్క విద్యార్థీ పాస్ కాని పాఠశాలలు రెండు

ఈ ఏడాది రెండు ప్రైవేటు పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాలేదు. ఈ ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 99.29శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. వికారాబాద్‌లో అతి తక్కువగా 73.97శాతం ఉత్తీర్ణత నమోదైంది.

# పవన్ కల్యాణ్ ఇప్పుడు ప్రాయశ్చిత్త దీక్ష చేయాలి

**అమరావతి,:** సింహాచలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి చందనోత్సవంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మరణించడం ప్రభుత్వ వైఫల్యం వల్లే జరిగిందని వైసీపీ నేత, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ దుర్ఘటనకు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. చందనోత్సవానికి లక్షలాదిగా భక్తులు వస్తారని తెలిసినా, ప్రభుత్వం సరైన ఏర్పాట్లు చేయడంలో ఉదాసీనంగా వ్యవహరించిందని వెల్లంపల్లి అన్నారు. నాసిరకం పనుల వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. సమీక్షా సమావేశాల్లో పాసుల పంపిణీపై చర్చించారే తప్ప, భక్తుల భద్రత, సౌకర్యాలపై దృష్టి పెట్టలేదని ఆరోపించారు. మంత్రులు అక్కడే ఉన్నా ఏర్పాట్లను పట్టించుకోలేదని, కనీసం టాయిలెట్ సౌకర్యం కూడా కల్పించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. గతంలో తిరుపతిలో జరిగిన తొక్కిసలాటను ప్రస్తావిస్తూ, వరుస ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం బాధ్యత తీసుకోవడం లేదని విమర్శించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పుడు ప్రాయశ్చిత్త దీక్ష చేయాలని డిమాండ్ చేశారు. ఆలయాల్లో జరుగుతున్న అపచారాలపై మాట్లాడాలని కోరారు. ఘటనలపై కమిటీలు వేసి చేతులు దులుపుకోవడం సరికాదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వెల్లంపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడొద్దని హెచ్చరించారు.

# అమరావతి పునఃప్రారంభానికి ప్రధాని మోదీ శంకుస్థాపన

మొదటి పేజి తరువాయి

ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు, బూత్‌స్థాయి కార్యకర్తలతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో డీఆర్డీవో, డీపీఐఐటీ, ఎన్‌హెచ్ఏఐ, రైల్వేలకు సంబంధించిన మరో రూ.57,962 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కూడా ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని సీఎం వివరించారు. గత ప్రభుత్వంలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ఇచ్చిన హామీ మేరకు, ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించారని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పది నెలల్లోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేస్తామని, విశాఖలో టీసీఎస్, వేగంగా నిర్మిస్తున్న భోగాపురం విమానాశ్రయం, శ్రీసిటీలో ఎల్జీ కంపెనీ రూ.5 వేల కోట్ల పెట్టుబడి వంటివి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని సీఎం పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే ఎన్డీఏ లక్ష్యమని, స్వర్ణాంధ్ర విజన్-2047తో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అమరావతిని నిర్వీర్యం చేసిందని, రైతుల త్యాగాలను వృథా చేసిందని విమర్శించారు. ప్రపంచ బ్యాంకు, ఏడీబీల సహకారంతో, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ఇతర రాష్ట్రాల ప్రజలు తమ రాజధానుల గురించి గర్వంగా చెప్పుకున్నట్లే "మా అమరావతి" అని ప్రతి ఆంధ్రుడు గర్వపడేలా రాజధానిని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రాజధాని నిర్మాణం ద్వారా వచ్చే ఆదాయంతో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యకర్తలే పార్టీకి మూలస్తంభాలని, వారిని అన్ని విధాలా గుర్తిస్తామని, నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని సీఎం భరోసా ఇచ్చారు. వచ్చే నెలలో అన్నదాత, తల్లికి వందనం పథకాలు ప్రారంభిస్తామని ప్రకటించారు.

సింహాచలం ఘటనపై ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి

సింహాచలంలో ప్రహరీ గోడ కూలి ఏడుగురు భక్తులు మరణించడం అత్యంత బాధాకరమని ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాను సంఘటనా స్థలానికి వెళ్తే భక్తుల దర్శనాలకు అంతరాయం కలుగుతుందని స్థానిక నేతలు సూచించడంతో అమరావతి నుంచే పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. మంత్రులు సంఘటనా స్థలానికి వెళ్లి బాధితుల కుటుంబాలను పరామర్శించి, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారని చెప్పారు. తాను ఉదయం నుంచి ఇతర కార్యక్రమాలను రద్దు చేసుకుని ఘటన అనంతర పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించినట్లు ముఖ్యమంత్రి వివరించారు.

# పందిపర్తి గ్రామంలో సివిల్ రైట్స్





ఉమ్మడి,అనంతపురం జిల్లా బ్యూరో "నరేంద్ర"( శుభోదయం న్యూస్) : ఈరోజు పందిపర్తి గ్రామంలో సివిల్ రైట్స్ కండక్ట్ చేయడం జరిగింది. పందిపర్తి %బాజ% కాలనీ నందు మీటింగ్ ఏర్పాటు చేసి అక్కడి ప్రజలకి పిల్లలను బాగా చదివించుకోవాలని అలా చదివించుకుంటేనే మీ తలరాతలు మారుతాయని, మంచి భవిష్యత్తు ఉంటుందని మరియు చిన్న చిన్న గొడవలు వెళ్లవద్దని మరియు ఎటువంటి ఇబ్బందులు ఉన్న పోలీస్ స్టేషన్ ఆశ్రయించాలని తెలపడమైనది.

## పెంట్రాల పంచాయితీ లో పారిశుద్ధ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎంపీడీవో కట్టా శ్రీనివాసరావు



లింగసముద్రం, రిపోర్టర్ – కే సురేష్ (శుభోదయం న్యూస్ ):జిల్లా పంచాయతీ అధికారి గారి ఆదేశాల మేరకు లింగసముద్రం మండలములోని పెంట్రాల గ్రామంలో ఎంపీడీఓ కట్టశ్రీనివాసులు .పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు మరియు పంచాయతీ సిబ్బంది తో పాటు మాజీ సర్పంచ్ మరియు గ్రామ నాయకుడు కిలారి కొండయ్య పారిశుద్ధ్య కార్యక్రమం ను తనిఖీ చేయటం కొన్ని కుటుంబాల వారికి ఐ వి ఆర్ ఎస్ కాల్స్ గురించి తెలియజేయడం డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్ మీద అవగాహన కల్పించడం మరియు ఎస్ డబ్ల్యూ పిసి షెడ్డును సందర్శించి పరిశీలించడం జరిగింది.

## శ్రీ అనుగురాజు యాదవ్ విగ్రహ ప్రతిష్ట కోసం భూమి పూజ మహోత్సవ కార్యక్రమం



పిడుగురాళ్ల, టౌన్ రిపోర్టర్ శీనివాసరావు (శుభోదయం నూస్): పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలోని గంగమ్మ దేవాలయం ఎదురు, అలనాడు అఖండ పల్నాటి రాజ్యాన్ని పరిపాలించిన చక్రవర్తి శ్రీ అనుగురాజు యాదవ్ విగ్రహ ప్రతిష్ట కోసం భూమి పూజ మహోత్సవ కార్యక్రమంలో పాల్గున్న మాజీ శాసనమండలి సభ్యులు మరియు టి. టి. డి పాలకమండలి సభ్యులు శ్రీ జంగా కృష్ణమూర్తి. ఈ కార్యక్రమంలో యరపతినేని నిఖిల్, అనుగురాజు యాదవ్ విగ్రహ కమిటీ మెంబెర్స్ మరియు పిడుగురాళ్ల పట్టణ, గురజాల నియోజకవర్గం యాదవ్ సోదరులు పాల్గొన్నారు.

# తుగ్గలిలో నామకరణ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మా...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండల కేంద్రమైన తుగ్గలి కు చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు, సింగిల్ విండో అధ్యక్షులు స్వర్గీయ ప్రహ్లాద రెడ్డి ,మాజీ సింగల్ విండో అధ్యక్షురాలు విజయలక్ష్మి దంపతుల కుమార్తె లక్ష్మీ సౌందర్య, అల్లుడు సుదర్శన్ రెడ్డి ల కుమార్తె కు బుధవారం నామకరణం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శ్రీ దేవమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ కు స్థానిక వైసిపి నాయకులు మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి లు స్వాగతం పలికి ఆహ్వానించారు. అలాగే ఈ కార్యక్రమానికి వైసిపి రైతు విభాగపు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షులు రమణారెడ్డి, చెన్నకేశవ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మల్లికార్జున్ రెడ్డి, వైసీపీ నాయకులు ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు హాజరై నామకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్ట రిత్యా నేరం వైద్యాధికారిని డాక్టర్ స్వాతి...



గుంతకల్,మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ):బాల్య వివాహాలు చట్టరిత్యా నేరం, శిక్షార్హమని అమ్మా యిలు పుస్తకాలు మోయల్సి న వయసులో గర్భం మోయాల్సి రావడం అత్యంత బాధాకర మైన విషయమని తిలక్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారిని డాక్టర్ స్వాతి, హెల్త్ ఎడ్యుకేటర్ వేణు గోపాల్ లు అన్నారు. తిలక్ నగర్ అంగన్వాడి కేంద్రంలో బుధవారం జరిగిన బాలవిహాలు నిర్మూలనపై అంగన్వాడి కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు ,స్థానిక మహిళలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల్య వివాహల నిరోధన చట్టం-2006, టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల జరిగే నష్టాలు ను వివరించారు. పీసీ పీఎన్డీటీ చట్టం-1994 గురించి అవగాహన కల్పించారు.



నేటి సమాజంలో మూఢనమ్మకాలు, ఇతర కారణాలతో ఆడపిల్లలకు చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేస్తున్నారని తత్ఫలితంగా వారు టీనేజీలోనే గర్భం ధరించి అనేక రకాలైన శారీరక, మానసిన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరిత్యా నేరమని ఆడ, మగ ఇద్దరూ సమానమేనన్నారు. తల్లిదండ్రులు ఆడబిడ్డలను వారసులుగా స్వీకరించినపుడే స్త్రీల నిష్పత్తి మగవారితో సమానమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ పద్మలత, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## ఏరూరు వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే....



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): తుగ్గలి మండలం పరిధిలోని రాంపురం గ్రామానికి చెందిన వైయస్సార్ సిపి నాయకులు ఏరూరు గోవిందరాజులు రంగమ్మ దంపతుల కుమార్తె సునీత, శ్రీనివాసుల ల వివాహ వేడుకలు బుధవారము అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వివాహ వేడుకలకు పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ, ఎంపీపీ గౌరవ సలహాదారుడు శభాష్ పురం హనుమంతు, పార్టీ సీనియర్ నాయకులు ఎర్రగుడి రామచంద్రారెడ్డి, రాతనమోహన్ రెడ్డి టీఎండి హుసేని, తుగ్గలి మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, చాంద్ బాషా, మాజీ ఎంపీపీ ఎర్ర నాగప్ప, ఆమీనాబాద్ రామాంజనేయులు ,సర్పంచ్ లు షేక్ లడ్డు కమల్ భాష, పగిడిరాయి బోడి బండ హనుమంతు ,ఎంపీటీసీ పుష్పావతి, వైసిపి నాయకులు జొన్నగిరి రఘు,పకీరప్ప, ముక్కెళ్ల లక్ష్మణస్వామి, కొట్టాల సయ్యద్ హుస్సేన్ బాషా, గంగాధర్, వెంకటేష్ ఓబులేష్ గోవిందరాజులు, రామాంజనేయులు యాదవ్, బద్రి పలువురు ప్రభుత్వ అధికారులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు , ప్రజలు హాజరై నూతన వధువు వరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

# యానాదులను వెట్టి చాకిరీ చేయిస్తున్న పీతల మాపియాను తక్షణమే అరెస్ట్ చేయాలి తిరువీధుల శంకర ప్రసాద్



(శుభోదయం న్యూస్)బాపట్ల జిల్లా : రేపల్లి మండలం లోని బాబ్బార లంక,విశ్వరం యానాది కాలనీలలోని పీతల మాపియా బాధిత ఫ్యామిలీ లను పార్మర్శించి, వారికీ మేము వున్నాము, అని నాయకులు హామీ ఇచ్చారు, బాపట్ల జిల్లా రేపల్లె మండలం లోని చోడాయపాలెం విలేజ్ లోని బొబ్బరలంక యానాది కాలనీ లోని నంబూరి పద్మ, భర్త అగ్ని,మచ్చ లంకాయ్య,నక్క చంద్ర కళ లను పీతల వేటకు తీషకొని పోయి వారి కట్టు బానిషలు చేచి పీతల వేటకు పేరు తో లక్షలు సంపాదించుకొని యానాదిప్రజలకు స్టోర్ బియ్యం సరుకులు, బీడీలు, మందు కొరకు వారానికి రూ. 300/- ఇచ్చి పీతల వేట చేయగా, రోజుకు 5 కేజీల నుండి 10 కేజీల వరకు పట్టివ్వాలి. పనికి రోజువెల్లాలి. వెళ్లకపోయినా, పీతలు తగ్గినా, భార్య,భర్తలిద్దరిని కొట్టడం, తిట్టడం జరిగేది. వారికి ఇవ్వవలసిన డబ్బులు ఇవ్వకపోగా వారిని వేరేవాళ్లకి అమ్మటం జరుగుతున్నది. వారికి ఆధార్ కార్డు కూడా లేకుండా టీడీపి ప్రభుత్వం వచ్చిన తర్వాత యానాదులకు ప్రత్యేక ఆధార్ డ్రైవ్ లు పెట్టి, మొదట భర్త ఆధార్ దిగిన తర్వాత, భార్యను పంపిస్తారు,అపుడు, ఆమె కలెక్టర్ ని కలిసి కంప్లైంట్ ఇచ్చిన తర్వాత రేపల్లె డి ఎస్పీ కి, ఆర్డీవో విచారించి కేసు నమోదు చేయమని చెప్పగా, చౌడాయపాలెం ఎస్సై పీతల మాఫియాకు అనుకూలంగా మరల మేటర్ వ్రాసుకొని, వీరు నిరక్షరాసులు కావటంతో వారితో వేలిముద్ర వేయించుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేశారుకానీ ఆ ఎఫ్ఐఆర్ లో ఎస్సి, ఎస్టీ కేసు నమోదు, వెట్టి చాకిరి, బందీలుగా ఉంచి కొట్టి నందుకు గాని పలు క్రిమినల్ సెక్షన్ లు పెట్టలేదు. వారి అరెస్ట్ కూడా చూపించలేదని పోలీస్ స్టేషన్ కు వెళ్లిన యానాది నాయకులతో సరిఅయిన సమాధానం చెప్పటలేదని, పీతల మాఫియా బాధితులను ఇంకా వెంబడిస్తూ, మీరుకట్టవలసిన డబ్బులు కడతారా లేదంటే మిమ్మల్ని మరల కిడ్నాప్ చేసి పీతల వేట చేయించుకుంటామని బెదిరించటం వలన పీతల బాధితుల యానాధులను రేపల్లి లోని (డి.ఎస్.పి)ని, రూరల్ సీఐ ని కలిసి మా యానాది పీతల మాపియా నుండి రక్షణ కల్పించి, న్యాయం చేయవలసిందిగా కోరగా, ఆయన, ఎస్సై కట్టిన ఎఫ్ఐఆర్ ను మరల మార్చి, నాన్ బెయిల్ బిల్ సెక్షన్ పెట్టి, తోరలో పీతల మాపియా వారి అరెస్ట్ చేస్తాం అని హామీ ఇచ్చినారు, స్పందించి బాధితులకు రక్షణ కల్పించి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంలో బాధితుల తరుపున టీడీపి రాష్ట్ర నాయకులు,కుదరవెల్లి వెంకటేశ్వరరావు , యానాది హక్కుల పోరాట సమితి అధ్యక్షులు తిరువిధుల శంకర్ ప్రసాద్, లాయర్ దోవ రమేష్ రాంజీ, యానాది సంక్షేమ సంఘం జిల్లా చైర్మన్ కొమరగిరి చెంచయ్య పాల్గొని వారికి ఏళ్ల వెళ్ళల అండగా ఉంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## కష్టజీవుల కవి శ్రీశ్రీ... తెలుగు కవిత్వాన్ని కదం తొక్కించిన గొప్ప కవి శ్రీ శ్రీ



(శుభోదయం న్యూస్) బాపట్ల జిల్లా: అక్షరాలను అణు బాంబులు గా పేల్చారు. కష్టజీవుల కవిగా ఆయన ఖ్యాతి కెక్కారు. సమ సమాజ స్థాపన కోసం కలం పట్టారు, గళం విప్పారు. యువతలో ఉద్రేకం రగిలించారు ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసారు. అంధ విశ్వాసాలను చెరిగి పారేశారు. మహా ప్రభంజనం సృష్టించిన ఆయన 'మహాప్రస్థానాని'కి ఇది 75 వ సంవత్సరం.శ్రీశ్రీ 115వ జయంతి సందర్భంగా బుధవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో శ్రీ శ్రీ మహాప్రస్థానం పాకెట్ పుస్తకాలను విడుదల చేశారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పి సి సాయి బాబు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఏ వి రమణరావు, అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ కలాం, లావణ్య, నైమిశా, పద్మజ, సుశీలావతి,భాస్కరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

# గన్నవరం విద్యుత్ సబ్ స్టేషన్లో తీరని కష్టాలు



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్) :సిబ్బంది కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆయా గ్రామాల ప్రజలుఒకొక్క లైన్ మెన్ కు 5 నుండి 6 గ్రామాలు అప్పగించిన అధికారులుపని భారమై సకాలంలో విద్యుత్ వినియోగదారులకు సేవలు అందించలేకపోతున్న సిబ్బందిపలు పారిశ్రామిక వాడలు,ఎయిర్ పోర్ట్ నిత్యం విఐపి ల తాకిడిసతమతమవుతున్న సిబ్బందిఎం చేయలేని నిస్సహాయ స్థితిలో విధులు కొనసాగిస్తున్న విద్యుత్ సిబ్బంది

# పంట వ్యర్థాలను తగలబెట్టడం వలన భూసారానికి పర్యావరణానికి కలుగు హానిపై అవగాహన కార్యక్రమం



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్) : గన్నవరం మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రములలో పంట వ్యర్థాలను తగలబెట్టడం వలన భూసారానికి పర్యావరణానికి కలుగు హానిపై అవగాహన కార్యక్రమం అనేది చే పెట్టడం జరిగినది ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట వ్యర్థాలను



తగలబెట్టడం వలన నేలలో పోషకాలు నశిస్తాయి ,భూమిలోని సేంద్రియ కర్బనం తగ్గిపోతుంది , నేలలోని ఉపయోగకరమైనటువంటి మొక్క ఎదుగుదలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు నశించడం, నేల యొక్క స్వభావం పూర్తిగా నిర్జీవం అయిపోతుంది, నేలలో తేమను నిలుపుకునే శక్తి తగ్గడం జరుగుతుంది, నేలలో ఆమ్లగుణం పెరుగుతుంది ,పర్యావరణ కాలుష్యం పెరిగీ ఆరోగ్యానికి అందరికీ ముప్పు అనేది వాటిల్లుతుంది అని మండల వ్యవసాయ అధికారిని యడవల్లి రజని రైతులకు అవగాహన కల్పించడం జరిగినది. గ్రామ పరిధిలో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతుల వాట్సాప్ గ్రూప్ నందు, మీటింగ్స్ ద్వారా మరియు మైకుల నందు పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల జరిగే నష్టాన్ని రైతులకు తెలియజేయడం జరిగినది.

# మధుసూదన్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమం సన్మానించిన నాయకులు,అధికారులు



తొట్టంబేడు, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న మధుసూదన్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం, వైసిపి పార్టీ నాయకులు ముఖ్య అతిథులుగా టిడిపి మండలాధ్యక్షుడు గాలి మురళి నాయుడు, వైఎస్ఆర్సిపి తొట్టంబేడు ఇంచార్జ్ వాసు నాయుడు లు మాట్లాడుతూ మధుసూదన్ రెడ్డి మండలానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం గజ మాలలు వేసి దుశ్యాలవలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీడీవో సురేంద్రబాబు గతంలో ఎంపీడీవో గా పనిచేసిన భాగ్యలక్ష్మి లు మాట్లాడుతూ వృత్తి పట్ల ఆయన శ్రద్ధను సమయ స్ఫూర్తిని, సహచర అధికారులతో నిబద్ధతతో ఏ పని చెప్పిన వెంటనే స్పందిస్తూ ఆయన పనితీరును మరొకసారి గుర్తు చేసుకుని కొనియాడారు. అనంతరం జ్ఞాపికలు ఇచ్చి ఘనంగా గజ మాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ జగన్, తెలుగుదేశం నాయకులు ప్రకాష్ నాయుడు, వైయస్సార్సీపి మండల వైస్ ఎంపీపీ మల్లికమ్మ, జడ్పిటిసి భర్త మునిరత్నం, మండలాధికారులు, సర్పంచులు,ఎంపీటీసీలు పంచాయతీ సెక్రటరీలు,పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ వేలం పాట నిర్వహించిన శ్రీ భైరవేశ్వర స్వామి దేవస్థానం అధికారులు



పామూరు మండలం రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): ఈరోజు శ్రీ భైరవేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ గారు సమక్షంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి వంశీకృష్ణ రెడ్డి గారి ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముప్పాళ్ళ శ్యాంసుందర్ రాజు, గుంటి మడుగు వెంకట రామరాజు,ముద్దులూరి శ్రీనివాసరాజు, ముద్దులూరి వెంకట రాజు, ముప్పాళ్ళ శ్రీనివాసులురాజు, రుద్రరాజు రాజేంద్ర రాజు అర్చక బృందం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి

**అఖిలాభారత కిసాన్ ఫెడరేషన్ ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎండి ఇస్మాయిల్**



శుభోదయం న్యూస్, సంగెం:సంగెం మండలంలోని షాపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సందర్శన చేయడం జరిగిందిఈ కార్యక్రమంలో ఇస్మాయిల్ మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు సెంటర్కు తీసుకువచ్చి ఆరు రోజులు ఐతున్నది కొనుగోలు కేంద్రాలు స్టార్ట్ చేసి ఇప్పటివరకు రైతులకు ఏ ఒక్క రైతు కూడా ధాన్యానికి సంబంధించిన పరదాలుగాని ఏ రైతు కూడా ఒక పరద కూడా ఇవ్వలేదు ఒకపక్క ఈదురు గాలులతో వర్షాలు వస్తున్నప్పటికీ కొనుగోలు కేంద్రం ధాన్యాలకు పరదాలు ఇవ్వకుండా వాళ్ల ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆ కొనుగోలు కేంద్రంపై సందర్శన చేసి రైతులకు సరిపడా పరదాలు ఇచ్చి ధాన్యాన్ని వెనువెంటనే కాంటాలు వేసుకొని రైతులకు అమ్మిన ప్రకారంగా కొనుగోలు కేంద్రం ద్వారా పట్టిక ఇచ్చి రైతులకు భరోసా కల్పించాలి రైతుల యొక్క ధాన్యం దోపిడీదారులను వెంటనే అరికట్టాలి ఈ దోపిడీ అరికట్టకపోతే రైతులందరినీ సమీకరించి కొనుగోలు కేంద్రాల యందు ధర్నాలు చేస్తాం దీనికి ప్రభుత్వం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత వహించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కన్వీనర్ గోనె రామచంద్ర, రౌతు శ్రీనివాస్, జక్కా అశోక్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# రక్షిత ఫార్మ కంపెనీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



పామూరు, మండలం రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు గారి వియ్యంకులు చందన రామేశ్వర రావు హైదరాబాద్ లోని గచ్చిబౌలి లో రక్షిత డ్రగ్స్ మరియు ఫార్మా కంపెనీ ఏర్పాటు చేశారు. బుధవారం ఫార్మా కంపెనీ నూతన కార్యాలయాన్ని కనిగిరి మాజీ శాసనసభ్యులు, వైఎస్సార్ సీపీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు గారు



ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కదిరి బాబురావు దంపతులు, కె వి ప్రకాశ్ రావు,కదిరి పార్థసారథి దంపతులు, ప్రముఖ పారిశ్రామిక వేత్త గిరిధర్ రెడ్డి,వరికుంటపాడు మాజీ ఎంపీపీ సుంకర వెంకటాద్రి, సుంకర అంజనాద్రి, తాతారావు ,డాక్టర్ కదిరి వరుణ్, అవినాష్ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ శివారులో దారుణ హత్య




విజయవాడ, శుభోదయం న్యూస్: విజయవాడ న్యూ ఆటోనగర్ వివాన్ వద్ద దారుణ హత్య జరిగింది. ఎనికేపాడుకి చెందిన సుబ్బారావు అలియాస్ కేబుల్ నాని (45)ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి సుబ్బారావు బయటకు వచ్చాడు. నేడు విగతజీవిగా డ్రైనేజీ కాలువలో



శవమై తేలాడు. సుబ్బారావు ఒంటిపై కత్తి గాట్లు తల మీద ఒక కత్తి దాటు చెవ్వు మీద ఒక కత్తి గాడు ఉండడంతో పోలీసులు హత్యగా భావిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# పాల కేంద్రాల అభివృద్ధికి కృషి: చలసాని ఆంజనేయులు



గన్నవరం, నియోజవర్గం ఇంచార్జ్ – సురేష్:ఏప్రిల్ 30(శుభోదయం న్యూస్) : పాడి రైతులతోపాటు పాల కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. గన్నవరం మండలం గోపవరపు గూడెంలో ఐదు లక్షల రూపాయలతో కొత్తగా నిర్మించిన పాల కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే, యూనియన్‌జిల్లా డైరెక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ.. గ్రామాల్లో వ్యవసాయం తర్వాత పాడి పరిశ్రమ రైతులకు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పిస్తుందన్నారు. మేలు జాతి పశువుల పోషణ ద్వారా పాల ఉత్పత్తిని పెంచవచ్చు అన్నారు. పాలు పెరిగితే ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. పాడి రైతులకు కృష్ణ మిల్క్ యూనియన్ ద్వారా ప్రతి ఏడాది లక్షల రూపాయలు బోనస్ అందిస్తున్నామని, ఈ ఒక్క గోపవరపు గూడెం లోనే 8 లక్షల రూపాయలు బోనస్ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పాడి రైతుల కుటుంబాలకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జిల్లా డైరెక్టర్ దాసరి వెంకట బాలవర్ధన రావు మాట్లాడుతూ.. గ్రామాలలో పాల కేంద్రాలు సొంత భవనాలను అందుబాటులోకి తెచ్చుకోవడం ద్వారా బలోపేతం కావడానికి అవకాశం ఉంటుందన్నారు. జీరో తో మొదలైన గోపవరపు గూడెం పాలకేంద్రం క్రమంగా అభివృద్ధి చెంది సొంతంగా ఐదు లక్షల రూపాయలతో పాల కేంద్రం నిర్మించుకోవడం అభినందనీయం అన్నారు. పాడి రైతుల జీవితాల్లో మార్పు కోసం కృష్ణ మిల్క్ యూనియన్ నిరంతరం పాటుపడుతుందని చెప్పారు. ఎన్ని ప్రైవేట్ సంస్థలు వచ్చిన మిల్క్ యూనియన్ తట్టుకొని ముందుకు వెళుతున్నారు. పాడి రైతులు అండగా ఉండడమే అందుకు కారణం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్ పలగాని కొండలరావు, గోపవరపు గూడెంపాలకేంద్రం అధ్యక్షులు నల్లూరు వెంకట శివప్రసాద్, డైరెక్టర్లు చిట్టినేని కోటేశ్వరరావు, తరిగొప్పల శ్రీనివాసరావు, బి తేరేజి రాజు, పసుపులేటి సుబ్బారావు, రూట్ మేనేజర్ యశ్వంత్, రూట్ సూపర్వైజర్ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతికి దైవ బలం ఉంది : యార్లగడ్డ



గన్నవరం, నియోజవర్గం ఇంచార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్): రాష్ట్ర రాజధాని అమరావతికి వాక్ శుద్ధి గల స్వామీజీల అండతోపాటు, దైవ బలం కూడా తోడవటంతో గత ప్రభుత్వం అమరావతిని అంగుళం కూడా కదల్చ లేకపోయిందని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న భువనేశ్వరి పీఠం నూతన భవన నిర్మాణానికి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు తొండేపు దశరథ జనార్ధన్ తో కలిసి గురువారం ఉదయం యార్లగడ్డ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆయన శివపార్వతుల కళ్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి యార్లగడ్డ ప్రసంగిస్తూ ఎంతో ప్రాశస్త్యం ఉన్న కృష్ణాజిల్లాలో పుట్టటం గర్వకారణంగా ఉందన్నారు. యువత, మేధావులు వలస వల్ల ప్రస్తుతం కృష్ణాజిల్లా నిర్వీర్యంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో మన జిల్లా నుంచి అత్యధికంగా పన్నులు చెల్లించే వారిని గుర్తు చేశారు. టాక్స్ ప్లేయర్స్ అందరూ వలస వెళ్లిపోవడంతో జిల్లాలో యువతకు ఉద్యోగ



అవకాశాలు లేక విదేశీ బాట పట్టారని వివరించారు. వలసలను నిరోధించేందుకు జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువత ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఎంతో చరిత్ర ఉన్నా అమరావతిని టిడిపి ప్రభుత్వం రాజధానిగా నిర్ణయించి పనులు ప్రారంభిస్తే తదుపరి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. లోక కళ్యాణం కోసం పరితపిస్తున్న కమలానంద భారతి స్వామి ని అభినందించారు. అప్పట్లో అధికార పార్టీలో ఉన్న తనతోపాటు కొందరు ఎమ్మెల్యేలు సైతం మూడు రాజధానులు వ్యతిరేకించారని గుర్తు చేశారు. జిల్లా అభివృద్ధికి పాటుపడిన మహనీయుల విగ్రహాలను జిల్లా కేంద్రంలో పెట్టేందుకు అధికారులు ముందుకు రాకపోతే తన సొంత నిధులు ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. కొత్తగా నిర్మించే పీఠం భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రిని తీసుకొస్తామని ప్రకటించారు. జనార్ధన్ మాట్లాడుతూ . అమరావతి అభివృద్ధి సంపద కేంద్రంగా అభివర్ణించిన ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూర దృష్టితో భూములు ఇచ్చిన రైతులకు ప్రయోజనం కలిగేలా మన దేశంలోనే తొలిసారిగా భూ సమీకరణ చేపట్టారని తెలిపారు. అమరావతి ఉద్యమంలో భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి రాజధానిలోని 29 గ్రామాల్లో పాదయాత్ర చేసి, ఎస్సీ కాలనీలో నిద్రించి ప్రజలను చైతన్యవంతం చేశారని కొనియాడారు. అమరావతికి రాష్ట్రంలోని పెద్ద సంఖ్యలో స్వామీజీలు మద్దతు పలకటం శుభపరిణామం అన్నారు. అంతకు ముందు మాట్లాడిన కమలానంద భారతి స్వామి తమ పీఠానికి ప్రభుత్వ పరంగా ఏ విధమైన ఆర్థిక సాయం అవసరం లేదని రాష్ట్ర అభివృద్ధి, అమరావతి పునర్నిర్మాణాన్ని వేగవంతంగా చేయాలని కోరారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రపంచంలో అన్ని దేశాలకు విమానం సౌకర్యం కల్పించాలని ఈ దిశగా కృషి చేయాలని నాయకులకు సూచించారు. ఈకార్యక్రమంలో మైనార్టీ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఫరుఖ్ షుబ్లీ, పాలడుగు రాఘవేంద్ర, దమ్మాలపాటి చంద్రశేఖర్, మూల్పూరి మాధవన్, విష్ణుభట్ల రామచంద్ర, రాఘవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# విప్ యార్లగడ్డ చొరవతో వంతెనలకు నూతన సొబగులు



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్): ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో జాతీయ రహదారి పైన ఉన్న వంతెనలకు నూతన శోభ సంతరించుకొనుంది. రామవరప్పాడు నుండి బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామం వరకు గతంలో టిడిపి ప్రభుత్వం ఉండగా ఎంతో అందంగా సుందరంగా ఉండే జాతీయ రహదారిని గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేయడంతో అధ్వాన్నంగా తయారైంది. దీనికి తోడు పలు గ్రామాల్లో వ్యర్థాలను జాతీయ రహదారి పక్కన వేయడంతో రహదారి డంపింగ్ యార్డ్ లా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ రహదారిని సుందరీకరణ చేయాలని పలు సమావేశాల్లో ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అధికారులను కోరారు. అత్యధికంగా వీఐపీలు, వివిఐపీలు సంచరించే ఈ రహదారి సుందరీకరణ చేపట్టాలని, వంతెనలపై ఫ్లాట్ ఫామ్ పునర్నిర్మించి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని జాతీయ రహదారుల సంస్థకు లేఖ రాశారు. యార్లగడ్డ లేఖ కు సానుకూలంగా స్పందించిన జాతీయ రహదారుల సంస్థ వంతెనల పై ఫ్లాట్ ఫామ్ పునర్నిర్మాణ పనులను ప్రారంభించింది. కేసరపల్లి ఏలూరు కాలువ పై ఉన్న వంతెన ప్లాట్ఫారం నిర్మాణ పనులను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గురువారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ కాంట్రాక్టర్కు పలు సూచనలు ఇచ్చారు. ఇదే దారిలో విజయవాడ వెళుతున్న టిడిపి పోలీసు బ్యూరో సభ్యులు తొండెపు దశరథ జనార్ధన్ ఆగి కార్ దిగివచ్చి కార్మికుల చేస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారికి పూర్వపు శోభ సంతరించుకునేలా చేస్తున్న యార్లగడ్డ ను అభినందించారు.

# వీరవల్లిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు అట్టహాసంగా సాగిన శంకుస్థాపన మహోత్సవం



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్) : బాపులపాడు మండలం వీరవల్లి సిఎస్ ఐ చర్చి వద్ద నూతనంగా నిర్మించే బీ ఆర్ అంబేద్కర్ విగ్రహం నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన కార్యక్రమం కనుల పండువగా సాగింది. ఎన్నో ఏళ్ల నుంచి రాజ్యాంగ నిర్మాత బి. ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు భావిస్తున్నారు ఈ కార్యక్రమానికి సర్పంచ్ పిల్లా అనితా, గ్రామ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గుండపనేని ఉమా వరప్రసాద్, మాజీ సర్పంచులు పిల్లా రామారావు, నందమూరి కృష్ణప్రసాద్, ఉప సర్పంచ్ లంక అజయ్, కలపాల రాజబాబు, మాల మహానాడు నాయకులు బేతాళ శరత్ , సుందరం మాస్టర్ , వెలగపల్లి వెంకటేశ్వరరావు, ఇలపర్తి సుధాకర్, వన్నేకూటి నరేష్, ధర్మేంద్ర, , ఇలపర్తి ఎడ్విన్ సిలువరాజు యంగ్ ఇండియన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణం పై దాడులు నిర్వహించిన విజిలెన్స్ అధికారులు



త్రిపురాంతకం, ఏప్రిల్ 30 శుభోదయం విలేఖరి – గుత్తాచిన్న మూర్తయ్య: ఎరువుల దుకాణంలోని నిల్వలకు ఈపాస్ లో నిల్వలకు వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించిన విజిలెన్స్ అధికారులు మండలంలోని స్థానిక త్రిపురాంతకంలో బుధవారం విజిలెన్స్ అధికారులు ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించారు శ్రీ వెంకట సుబ్రహ్మణ్యేశ్వర ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో విజిలెన్స్ సీఐ రవిబాబు ఆధ్వర్యంలో 14,265 పెట్రిక్ టన్నుల ఎరువులు చీజ్ చేసినట్టు వాటి విలువ 2 లక్షల 33 వేల 781 05పైసలుగా గుర్తించినట్లు అంతేకాకుండా ఎరువుల దుకాణంలోని ఎరువుల స్టాకులకు ఈపాస్ స్టాకులకు వ్యత్యాసాలను గుర్తించినట్లు ఆయన తెలిపారుఆయన వెంట వ్యవసాయ అధికారి శివ నాగరాజు హెడ్ కానిస్టేబుల్ రవి కానిస్టేబుల్ చిన్ని కృష్ణ త్రిపురాంతకం వ్యవసాయ అధికారి నీరజ పాల్గొన్నారు.

# పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు సమాజ చైతన్య జ్వాల శ్రీ శ్రీ ఘనంగా జయంతి వేడుకలు



ఉమ్మడి అనంతపురం జిల్లా బ్యూరో "నరేంద్ర" (శుభోదయం న్యూస్ ): స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ (స్వయం ప్రతిపత్తి) కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యం లో 30 -04 -2025 న మహా కవి శ్రీ శ్రీ జయంతి వేడుకలు ఘనంగా. నిర్వహించబడ్డాయి.తెలుగు శాఖాధిపతి డా బూసి వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో ముందుగా శ్రీ శ్రీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం జరిగిన సభలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ మాట్లాడుతూ శ్రీ శ్రీ కవిత్వం సమాజ హృదయాంతరాళాలను కదిలించే చైతన్య జ్వాలని పేర్కొన్నారు .అయన మట్టి మనుషుల పక్షాన నిలిచి అక్షరాయుధం తో పోరాడిన మహనీయుడన్నారు.జంతు శాస్త్ర విభాగాధిపతి డా యం రామకృష్ణ మాట్లాడుతూ శ్రీ శ్రీ కార్మికుల కర్షకుల పక్షాన నిలిచి సమాజాభ్యుదయానికి బాటలు వేశారని,బూర్జువా వ్యవస్థను కూకటి వేళ్ళతో కదిలించి వేసి శ్రామిక సమాజం వెల్లివిరియాలని,శ్రమైక జీవన సౌందర్యంతో సమాజం సుందరంగా తయారౌతుందన్నారు.తెలుగు శాఖాధిపతి డా బూసి వెంకటస్వామి మాట్లాడుతూ శ్రీ శ్రీ అంతర్జాతీయ కవి అని మొదట సంప్రదాయవాదిగా కొనసాగినా తదనాతరం భావ కవిగా,విప్లవ కవిగా ,అభ్యుదయ కవిగా పరిణితి చెంది ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి పేరు పొందారన్నారు.శ్రీశ్రీ మాట అక్షరమై ప్రతిధ్వనించిచేరాతల్లో ప్రతిఫలించి సమ సమాజవాదిగా, పీడిత పక్షపాత ప్రతినిధిగా, జ్వలించే క్రాంతదర్శి గా, నవతర మార్గదర్శి గా నిలిచారన్నారు.ఈ కార్యక్రమం లో ఇంగ్లీష్ విభాగాధిపతి యన్ వి డి దినకరన్,అర్థశాస్త్ర విభాగాధిపతి డా.సి హెచ్ ఉషారాణి ,అధ్యాపకులు డా వి విజయలక్ష్మి ,రామలక్ష్మి ,చేబ్రోలు రవికుమార్,శ్రీ దేవి ,రమేష్ కుమార్ ,శివకృష్ణ,మన్మధరావు ,జ్యోత్స్న,హెప్సిబా ,ఉమా శిరీష తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సత్య కుమార్ యాదవ్ సహకారంతో ధర్మవరం యువతకు ఉద్యోగ మహోత్సవం




ఉమ్మడి అనంతపురం జిల్లా బ్యూరో "నరేంద్ర "(శుభోదయం న్యూస్) : ధర్మవరం ఏప్రిల్ 30రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు సత్య కుమార్ యాదవ్ సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సత్య సాయి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా ధర్మవరంలోని స్థానిక సాయి రామ్ "ఐటీఐ "కళాశాల ఆవరణంలో జాబ్ మేళా నిర్వహించబడింది. ఈ జాబ్ మేళాకి 11 కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళా కు సుమారు 110 మంది యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 67 మంది వివిధ కంపనీలకు ఎంపిక కావడం జరిగింది. ఈ యొక్క జాబ్ మేళ కార్యక్రమంలో మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గం ఇంచార్జ్ హరీష్ బాబు మాట్లాడుతూ 2024 సంవత్సరం ఏప్రిల్ 4న ఎన్నికల ప్రచారానికి ధర్మవరంలో అడుగుపెట్టిన సత్య కుమార్ యాదవ్ , గ్రామాల వారీగా ఇంటి ఇంటికి తిరుగుతూ యువతతో నేరుగా ముఖాముఖి మాట్లాడారు ఆ సందర్భంగా, అనేక మంది యువతీయువకులు ఉద్యోగాలు లేక బాధపడుతున్నారని, తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఆ మాటలు గుండెల్లో వేసుకున్న శత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టారు. ఆయన ప్రత్యేకంగా స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా అనేక ఉద్యోగ మేళాలను నిర్వహించారు సంస్కృతి సేవాసమితి ఆధ్వర్యంలో "సివన్ని" గార్డెన్స్ వేదికగా జరిగిన ఉద్యోగ మేళాల్లో దాదాపు 1700 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించబడ్డాయి. ఇది మాత్రమే కాకుండా, మళ్ళీ రెండో దశలో రెండు వేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా పలు కంపెనీలు ముందుకొచ్చాయి. ఇందులో కొన్ని కంపెనీలు యువతకు లక్ష రూపాయల నుంచి రెండు లక్షల దాకా వార్షిక జీతాలు అందించే అవకాశం కూడా కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ప్లేస్ మెంట్ అధికారి తేజ్ కుమార్, మరియు ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సిబ్బంది. మరియు సీడాప్ సిబ్బంది. ఎంప్లాయిమెంట్ అధికారి, ఐటిఐ కన్వీనర్/ప్రిన్సిపల్ రాయప రెడ్డి , పట్టణ అధ్యక్షులు జింక చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబ్లేస్, అప్రెంటిషిప్ అడ్వైజర్స్ ఓబులేసు, ఐటిఐ కళాశాల కరస్పాండెంట్ హరినాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి , మరియు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సత్తా చాటిన మహాత్మా జ్యోతిబాపూలే విద్యార్థులు.




బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కామారెడ్డి జిల్లా బీర్కూరు మండల కేంద్రంలో ఉన్నటువంటి మహాత్మా జ్యోతిబాపూలే విద్యార్థి బాన్సువాడ మండలం కొములంచ గ్రామానికి చెందిన కె విష్ణువర్ధన్ 565/600 మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఓ నిరుపేద కుటుంబానికి చెందిన తండ్రి కె.మల్లుగొండ వృత్తి నిత్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు కుమారునికి 5వ తరగతి లో మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల కు ప్రవేశ పరీక్ష రాయించిన తండ్రి సీట్ రావడాన్ని సంతోషించిన తల్లిదండ్రులు. నేడు వంద రెట్లు సంతోషిస్తున్నారు కుటుంబానికే కాకుండా బీర్కూరు మండలానికి మరియు పాఠశాలకు వన్నె తెచ్చిన విష్ణువర్ధన్ మండల స్థాయి లో 565/600 మార్కులు సంధించాడు. పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమార్ మాట్లాడుతూ పదవతరగతి విద్యార్థుల ఫలితాల్లో నూటికి నూరు శాతం 100% ఫలితాలు రావడం చాలా సంతోషంగా ఉంది అని తెలిపారు. పాఠశాల లో టాప్ మార్కులతో కె విష్ణువర్ధన్ 565/600 మార్కులు సాధించగా జి అఖిల్ 558/600, కె విఘ్నేశ్వర్ 556/600, కపిల్ 556/600, పీ లక్ష్మణ్ 551/600, బి సుచిత్ 549/600 మార్కులు సాధించి మండలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు చెప్పారు .

# మజ్జిగ పంపిణీ చేసిన మానవతా సేవా సంస్థ



పామూరు మండలం రిపోర్టర్ బండి రమేష్ ( శుభోదయం న్యూస్): వేసవి తీవ్రత దృష్ట్యా పాదచారులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించిన పామూరు మానవత సేవా సంస్థ చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమం ప్రారంభించిన కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు కోట నరసింహా రావు, మానవత అధ్యక్షులు మేడబలిమి ముసలయ్య, పూర్వ అధ్యక్షులు మానవతా పోలక తిరుపతి రెడ్డి ,ఈ కార్యక్రమంలో కార్యదర్శి నేరెళ్ల బాబురావు, ఆర్థిక కార్యదర్శి తోట రమేష్ , కన్వీనర్ వెండిదండి వెంకటేశ్వరరెడ్డి ,ఉపాధ్యక్షులు . బి ఎస్. రంగారెడ్డి, ఏ. మాల్యాద్రి, సేగు కృష్ణయ్య, టి. సత్యనారాయణ, ఎం.తిరుపతి రెడ్డి, ఆర్.సత్యనారాయణ,జి. శ్రీనివాసులు రెడ్డి, ఎస్. రామకృష్ణ ఎస్.లక్ష్మణ, వి.రాజేంద్ర,పరమేశ్వర రావు,కొరివి రమణయ్య తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు ఈ కార్యక్రమం గాను సహకరించిన వారందరికీ టెంట్, టేబుల్స్, కుర్చీలు అందించిన నాయుడు షామియానా మానవత ద్వారా ధన్యవాదములు తెలిపారు

# వివాహ వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఎంపీటీసీ సంఘం అధ్యక్షుడు ఆకుపాటి



పామూరు మండలం రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): ఆత్మకూరు డివిజనల్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాము కుమారుడు వివాహ వేడుకల్లో జిల్లా ఎంపీటీసీ సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ బుధవారం బేస్తవారిపేట లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించారు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నల్లబోతుల చెన్న, జస్వంత్, సుంకే వెంకటేశ్వర్లు, నల్లబోతుల పవన్ చందు, తదితరులు పాల్గొన్నారు.

# కారు బోల్తా పడి ఒక వ్యక్తి దుర్మరణం



చంద్రశేఖరపురం, మండలం రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): చంద్రశేఖరపురం మండలం ఖమ్మంపాడు గ్రామ సమీపంలో బుధవారం ప్రమాదం జరిగింది కారు అదుపుతప్పి బోల్తా పడింది ఘటనలో హరివేముల గ్రామానికి చెందిన కృష్ణ చెందినట్లు స్థానికులు తెలిపారు కారు పలిటీలు కొట్టడంలో నుజ్జు నుజ్జు అయింది సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై సుమన్ మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

# కిషోరీ వికాసంపై ప్రత్యేక వేసవి అవగాహన సదస్సులు



(శుభోదయం న్యూస్)బిట్రగుంట: బోగోలు మండలం స్త్రీశక్తి భవనం సమావేశ మందిరంలో బుదవారం కావలి ఐసిడిఎస్ ప్రాజెక్టుఅధికారి సౌజన్యఆధ్వర్యంలోకిషోరీ వికాసంకార్యక్రమంపై అవగాహన సదస్సునిర్వహించడం జరిగింది. కార్యక్రమానికిముఖ్యఅతిథిగా విచ్చేసినఎంపీడీవోసుబ్రహ్మణ్యం మాట్లాడుతూగ్రామీణప్రాంతాలలో ఉన్నకిషోరీబాలికలువేసవి సెలవులకుఇంటివద్దఉంటారని, వారినిగ్రూపులుగావిభజించి బాల్యవివాహాలవలనకలిగే అనర్థాలు,చట్టాలపైఅవగాహన, హెల్ప్ లైన్ నంబర్లు 181, 1098ల వినియోగంపైఅవగాహన కలిగించాలన్నారు.పై కార్యక్రమంలోసూపర్వైజర్లు కోటేశ్వరి,వాణి,సుప్రజ,మహిళా సంరక్షణకార్యదర్శులు,వైద్య, అంగనవాడిసిబ్బంది,పొదుపు మహిళలుతదితరులు పాల్గొన్నారు.

# బోగోలులో పలువురిని పరామర్శించిన మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి



(శుభోదయం న్యూస్) బిట్రగుంట: బోగోలు మండలంలో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబ సభ్యులను బుధవారం కావలి మాజీ శాసనసభ్యులు రామిరెడ్డిప్రతాప్ కుమార్ రెడ్డిపరామర్శించి కుటుంబసభ్యులకుధైర్యం చెప్పాడు.బేతనిపేటకుచెందిన గంగపట్లవెంకయ్య,గంగపట్ల సోమయ్య,తాళ్లూరుఅరుంధతి వాడకుచెందినయేసుపోగు మొలకయ్య,సోమవారంరాత్రి రోడ్డుప్రమాదంలోమరణించిన యువస్నేహితులకుటుంబ సభ్యులనుకలిసితనప్రగాఢ సానుభూతినితెలిపారు.పై కార్యక్రమంలోఆయనవెంటవైసీపీ సీనియర్ నాయకులు మద్దిబోయినవీరరఘు,తాళ్లూరు మాల్యాద్రి,మేకలశ్రీనివాసులు, సాల్మన్ రాజు,యంపిటిసి సుందరరాజు,సూరపనేని శ్రీనివాసులు,వెంకయ్య తదితరులుఉన్నారు.

# డాక్టర్ స్వర్ణగీతను మర్యాద పూర్వకంగా కలిసిన దేవలూటి శంకర్.....



పొదిలి, శుభోదయం న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ జేఏసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ : దేవలూటి శంకర్ ఈరోజు పొదిలి పట్టణంలో డాక్టర్ స్వర్ణగీత ను మర్యాదపూర్వకంగా కలిసి డాక్టర్ గీత కి శాలువాతో సన్మానం చేసి, పూలబొకే అందజేసి మాట్లాడడం జరిగింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డాక్టర్ స్వర్ణగీత కి మెడికల్ బోర్డు సభ్యురాలుగా నియమించడం జరిగింది..డాక్టర్ స్వర్ణగీత పొదిలి పట్టణంలో చుట్టూ పక్కల గ్రామాల ప్రజలకు ఎక్కువ సమయం అందుబాటులో ఉండి వైద్య%శీ% అందిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు.గత 10 సంవత్సరాలనుండి సామజిక సేవా కార్యక్రమాలలో కూడా డాక్టర్ స్వర్ణగీత పాల్గొంటూ పేద విద్యార్థిని, విద్యార్థుల పై చదువులకు సహాయం అందిస్తూ వస్తున్నారు.గతంలో కూడా డాక్టర్ స్వర్ణగీత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యురాలుగా తన సేవలను అందించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా డాక్టర్ స్వర్ణగీత కి మంచి డాక్టర్ గా, ఫుడ్ కార్పొరేషన్ సభ్యురాలుగా గుర్తింపు తెచ్చుకున్నారు. చాలా మందికి సూపరిచితురాలు.డాక్టర్ గీత ప్రకాశం జిల్లా, పొదిలి పట్టణానికి చెందిన వారు అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర%శీ%లో అన్ని జిల్లాలలో డాక్టర్ గీతని అభిమానిసూంటారు.భవిష్యత్ లోను ఇంకా మంచి మంచి ఉన్నత పదవులలో ఉండాలని శంకర్ ఆకాంక్షించారు.

# బాల్య వివాహాలపై ముస్లిం సోదరులకుఅవగాహన

సిద్ధవటం మండలం విలేకరి జాకీర్ హుస్సేన్ ( శుభోదయం న్యూస్): బాల్య వివాహాలపై అక్షయ తృతీయ పురస్కరించుకొని మండలంలోని మాధవరం గ్రామం ఆలీ నగర్ మదీనా మసీదు వద్ద బుధవారం ముస్లిం సోదరులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రూరల్ అండ్ ఎన్విరాన్మెంట్ సొసైటీ కోఆర్డినేటర్ రవీంద్రబాబు బుధవారం మాట్లాడుతూ మహిళలకు 18 సం, పురుషులకు, 21 సంవత్సరం పూర్తి పూర్తి ఆయన వెంటనే వివాహాలు చేయాలని బాల్య వివాహాలు చేపడితే మహిళలకు ఆరోగ్య సమస్యలు వస్తాయని వారి చదువు మధ్యలోనే ఆగిపోయే అవకాశం ఉందని తెలిపారు బాల్య వివాహాలు చేపడితే కఠినమైన చట్టాలు, ఏర్పడ్డాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

# సిద్ధవటం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా న్యాయవాది ఆదినారాయణ రావు



సిద్ధవటం మండల విలేకరి జాకీర్ హుస్సేన్ ( శుభోదయం న్యూస్): సిద్ధవటం జూనియర్ సివిల్ జడ్జ కోర్టుకి గవర్నమెంట్ లీడర్ ఏజీపీగా ఒంటిమిట్టకు చెందిన సీనియర్ న్యాయవాది శ్రీ గాదె ఆదినారాయణరావును నియమించినందుకు అందుకు సహకరించిన మా ప్రియతమ నాయకులు గౌరవనీయులు, రవాణా శాఖ మంత్రివర్యులు శ్రీ మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు, తెలియజేస్తున్నాను. గడచిన పది సంవత్సరాలుగా న్యాయవాదిగా కొనసాగుతున్న శ్రీ ఆదినారాయణరావును జిపిగా నియమించిన మండల తెలుగుదేశం పార్టీ తరఫున ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు మంత్రి శ్రీ రాంప్రసాద్ రెడ్డి గారికి తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య పాల్గొన్నారు.

# సైదాపురం మండలంలో పెట్రేగిపోతున్న రౌడీ మూకలు



నెల్లూరు, జిల్లా ప్రతినిధి - శ్రీనివాసులు (శుభోదయం న్యూస్ ) : సైదాపురం మండలం లో జరుగుతున్న అక్రమ మైనింగ్ సంబంధించి ప్రభుత్వ ఉన్నత అధికారుల ఆదేశాలతో మంగళవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు ఈ వ్యవహారంలో మైనింగ్ అధికారులు పాత్ర ఉందని విమర్శలు ఉన్నాయి సైదాపురం మైనింగ్ మాఫియా మంగళవారం పాత్రికేయులపై హల్చల్ చేశారు మైనింగ్ అక్రమాలపై మైనింగ్ వద్దకు వెళ్ళిన విలేకరులపై ఓ మైన్ సిబ్బంది దౌర్జన్యానికి దిగారు ఫోటో తీసుకోవడానికి అనుమతి ఇవ్వలేదు మాకు అనుమతులున్నాయి మీరు ఎందుకు వస్తారు అంటూ హెచ్చరికలు జారీ చేసారు సైదాపురం మండలం జోగి పల్లికి చెందిన ఓ నాయకులు తమకు ఉన్న రెండు మైనింగ్ లీజులు చూపించి చుట్టుపక్కల మైన్స్ నుండి పెద్ద ఎత్తున అక్రమంగా తరలిస్తున్నారని విమర్శలున్నాయి ఎవరైనా ప్రశ్నిస్తే తమకు అనుమతులు ఉన్నాయని కొందరు మైన్స్ యజమానులు చెబుతున్నారు ఇక్కడ వాస్తవ పరిస్థితులు కేవలం మైనింగ్ అధికారులకు మాత్రమే తెలుసు కనీసం ఎవరికి మైనింగ్ రహస్యాలు అధికారులు బయట పెట్టడం లేదు ఆఫీసుకు వెళ్లిన ఎవరు సమాధానం చెప్పరు ఈ విషయంలో ప్రత్యేక బృందాలతో విచారణ జరిపితే తప్ప వాస్తవాలు బయటికి రావు మైనింగ్ పోలీస్ రెవెన్యూ అధికారులు మైనింగ్ మాఫియా తో కలిసి పని చేస్తున్నారనే విమర్శలున్నాయి ఇలాంటి సమయంలో వీరికి




విచారణ బాధ్యతలు అప్పగిస్తే దొంగ చేతికి తాళాలు ఇచ్చినట్లే అనే స్థానికులు అంటున్నారు మంగళవారం విచారణకు వచ్చిన అధికారులు జోగిపల్లి సైదాపురం ప్రాంతాలలో పర్యటించి ఎవరికి తెలియకుండా వెళ్లిపోయారు ఏం విచారణ జరిపారు ఎవరు వచ్చారు అనే విషయం కూడా ఎక్కడ పొక్కనివ్వడం లేదు ఇటీవల వైసిపి నాయకురాలు పొట్టేళ్ల శిరీష, నెల్లూరు మైనింగ్ డిడిని కలిసి సైదాపురం మండలం లో లీజులు ముగిసిన శోభారాణి జయలక్ష్మి సిద్ధి వినాయక శోభారాణి మైన్ లలో అక్రమంగా మైనింగ్ కొనసాగిస్తూ జలటిన్ స్టిక్స్ తో పేలుళ్లకు పాల్పడుతూ గ్రామాలను భయాందోళనకు గురిచేస్తూ విచ్చలవిడిగా మైనింగ్ చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు దాంతో మంగళవారం విజిలెన్స్ అధికారులు సైదాపురం మండలంలోని సిద్ధి వినాయక శ్రీనివాస పద్మావతి జయలక్ష్మి మైండ్లతో పాటు మరికొన్ని మైండ్లలో సోదాలు నిర్వహించినట్లు సమాచారం అయితే మైనింగ్ విజిలెన్స్ ఎవరు వచ్చారు అనే విషయం అందు పట్టడం లేదు మూడో కంటికి తెలియకుండా ఎవరికి సమాచారం ఇవ్వకుండా వచ్చి గుర్తుచప్పుడు కాకుండా కనీసం స్థానిక విలేకరులకు కానీ మరేదైనా మీడియా వారికి కానీ ఇతర అధికారులకు గాని సమాచారం ఇవ్వలేదు. ఎక్కడికి వచ్చారు ఎన్ని మహిళల శోధాలు చేశారు వాటిలో ఏమైనా అక్రమాలు గమనించారా కనీసం ప్రాథమిక సమాచారం మీడియాకు గాని పత్రికలకు చెప్పడం లేదు మైనింగ్ డి డి కి చరవాణి ద్వారా ఎన్నిసార్లు ప్రయత్నించిన ఫోను ఎత్తడం లేదు మైనింగ్ అంతా మాయగానే కనిపిస్తుంది.

# సాంప్రదాయ కళలకు ప్రాధాన్యత ఇవ్వాలి టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు..



తెలంగాణ స్టేట్ బ్యూరో - కడిదల రామారావు (శుభోదయం న్యూస్): నేటి ఆధునిక యుగంలో సాంప్రదాయ కళలకు ప్రాధాన్యత ఇవ్వాలని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు అన్నారు. అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా పాల్వంచలో జనహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న నాగా సీతారాములు పరమశివుని ప్రతిరూపమైన నటరాజు విగ్రహానికి, జ్యోతి ప్రజ్వలన చేసి నృత్య పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలను కళాకారులను ప్రోత్సహించడం సామాజిక భాద్యత అని కళల కోసం అనునిత్యం కృషి చేస్తున్న జనహిత ఫౌండేషన్ చైర్మన్ శ్రీలక్ష్మి ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నాగా సీతా రాములును శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్ రావు, ఆరోరా చైర్మన్ తాళ్లూరి హరిబాబు, పాల్వంచ కళా పరిషత్ చైర్మన్ వేముల కొండలరావు, ఏఎస్ ఐ కమల కస్తూరి, మాజీ జడ్పీటీసి యర్రంశెట్టి ముత్తయ్య, వ్యాఖ్యాతగా నర్సింహకుమార్,వీరభద్రం, మరియు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన వరంగల్ జిల్లా అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ



పరకాల నియోజకవర్గం, శుభోదయం న్యూస్: భీమారం చింతగట్టులో గల బిజిఆర్ రాక్ గార్డెన్స్ లో



50వ డివిజన్ కార్పొరేటర్ నెక్కొండ కవిత-కిషన్ గార్ల కుమారుని వివాహ శుభ కార్య వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ. వడ్డేపల్లి 100ఫీట్ రోడ్ లో గల ఆర్.ఏ కన్వెన్షన్ హాల్ లో గుండాల మొగిలి రెడ్డి-జ్యోతి కుమారుని వివాహ శుభ కార్య వేడుకకు హాజరై మూడుముళ్ల బంధంతో ఒకటి అవుతున్న జంటను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ

# అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వేసవి సెలవులు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్‌హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. సాయిశ్వరీ



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) : అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు మే నెలంతా వేసవి సెలవులు కమీషనర్ క్రాంతీ వెస్లీ ప్రకటించిందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోయేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.సాయీశ్వరీ తెలిపారు. నేడు (బుధవారం) హైదరాబాద్‌లోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయంలో కమీషనర్ ఎ.క్రాంతి వెస్లీతో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోయేషన్ (ఎఐటియుసి), ఇతర సంఘాలతో జరిపిన చర్చలలో వేసవి కారణంగా తల్లులకు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలకు రావటానికి కష్టతరంగా ఉందని, లబ్ధిదారులకు టేక్ హెూం రేషన్ ఇచ్చి సెలవులు ప్రకటించాలని వినతి మేరకు కమీషనర్ సానుకూలంగా స్పందించి వేసవి సెలవులు మే నెలంతా ప్రకటించినందుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు సీతక్కకు, కమీషనర్‌కు, అధికారులకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ ఈ హెల్పర్స్ అసోసియేన్ (ఎఐటియుసి) తరపున ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా పరశురాముడి జయంతి ఉత్సవాలు. ముఖ్యఅతిథిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్.



రామగుండం, మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): స్థానిక 33వ డివిజన్ ముఖ్య నాయకులు బండి రాము ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి పరశురాముడి జయంతి వేడుకలకు



ముఖ్య అతిథులుగా గౌరవ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, అధ్యక్షులు బొంతల రాజేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా పరిసర డివిజన్ ముఖ్య నాయకులు ముస్తఫా , ప్రకాష్ , ఉదయ్ రాజ్ మరియు ముఖ్య నేతలతో కలిసి ఎమ్మెల్యే పరశురాముడి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దమనుషులు , మహిళలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ కార్పొరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులు అన్ని విభాగాల అధ్యక్షులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# పార్టీ కోసం పని చేసేవారికే పదవులు ఎమ్మెల్యే డా.మురళీ నాయక్..



తెలంగాణ స్టేట్ బ్యూరో- కడిదల రామారావు (శుభోదయం న్యూస్):నేడు సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసిసి,టిపిసిసి ఆదేశాలు మేరకు, రాష్ట్ర ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ సూచన మేరకు. డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా పిసిసి అబ్జర్వర్, మహబూబాబాద్ శాసనసభ్యులు డా భూక్యా మురళీ నాయక్ పాల్గొన్నారుఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.మురళీ నాయక్ మాట్లాడుతూ.పార్టీ కోసం పని చేసిన వారికి సంస్థాగత పార్టీ పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు.కష్టకాలంలో పార్టీ కోసం పని చేసిన వారిని పార్టీ గుర్తిస్తుందని, అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు.తానూ కూడా పార్టీ కోసం పని చేశానని, నా పనితనాన్ని అధిష్టానం గుర్తించి తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిందన్నారు.అలాగే సూర్యాపేట జిల్లాలో ఏంతో మంది కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రతిపక్షంలో ఉన్నపుడు, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేశారని గుర్తు చేశారు.అవకాశం వచ్చినా రాకపోయినా పదవులు ఉన్నా లేకున్నా పార్టీ సిద్ధాంతం కోసం పని చేస్తే పదవులు వాటంతటి అవి వస్తాయని గుర్తు చేశారు.

# పేదింటి ఆడపడుచు పెళ్లికి అండగా ఏ జే ఆర్ ఫౌండేషన్





వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోనినాతాళ్లగూడెం గ్రామానికి చెందిన ఉండాడిరామకృష్ణ,ప్రీతి వివాహ వేడుకల్లో వేములకొండగుట్ట మచ్చాద్రి ఫంక్షనల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించి వారి కుటుంబ సభ్యులకి ఏ జే ఆర్ ఫౌండేషన్ అధినేత10,000/-పదివేల రూపాయలుఆర్థిక సహాయంఅందించారు.ఈ కార్యక్రమంలో ఏ జే ఆర్ టీం సభ్యులు, వారి బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రఫీ వీడియోగ్రఫీ నందు ఉచిత శిక్షణ!



టంగుటూరు మండల రిపోర్టర్ వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నిరుద్యోగ యువతకు చేయూతనందించాలనే ఉద్దేశంతో రూట్ సెట్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మే 20 నుండి 30 రోజులపాటు ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో భోజన వసతి ఉచితంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

# అనంతవరంలో జరిగిన- సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు!

అధికారులను ప్రశ్నించడానికి ఈ సమాచార హక్కు చట్టం 2005- ఎంపీడీవో దేవసేనకుమారి వెల్లడి!



టంగుటూరు మండల రిపోర్టర్ వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- సమాచార హక్కు చట్టం 2005 యొక్క ప్రాధాన్యత గురించి మండల పరిధిలోని అనంతవరం గ్రామంలో బుధవారం జరిగిన అవగాహన సదస్సులో టంగుటూరు మండల అభివృద్ధి అధికారి శ్రీమతి దేవసేన కుమారి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ నిధులు ఏ విధంగా ఖర్చు చేస్తున్నారు? అభివృద్ధి ఎంత సాధించారు?! తదితర విషయాల గురించి సామాన్య ప్రజలు



తెలుసుకోవడానికి ఈ 2005 సమాచార హక్కు చట్టాన్ని తేవడం జరిగిందన్నారు. ఈ క్రమంలో ఇతర పలు జవాబుదారీతనానికి సంబంధించిన ప్రశ్నలను సంబంధిత అధికారులను ప్రశ్నించడానికి ఈ సమాచార హక్కు చట్టం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ క్రమంలో ప్రజలు ఈ సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీమతి మాలతి పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ కె భాస్కర్ వెలగపూడి మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు ఎంఈఓ చెంచు పున్నయ్య ఏపీఓ మాచర్ల తదితరులు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# ముక్కంటి సేవలో చత్రపతి శివాజీ మునిమనవడు స్వాగతం పలికిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు



శ్రీకాళహస్తి,రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): భరతమాత ముద్దుబిడ్డ చత్రపతి శివాజీ మునిమనవడు సంబాజీరాజే చత్రపతి శ్రీకాళహస్తీశ్వర దేవస్థానానికి విచ్చేశారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మసూదన్ రెడ్డి,మాజీ దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్ఆర్సిపి నాయకులు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి ప్రత్యేక రాహు కేతు పూజ,స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వేద పందితులచే ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం శ్రీకాళహస్తికే ప్రఖ్యాతిగాంచిన కలంకారి కండువాను కప్పి వినాయక స్వామి ప్రతిమను అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షుడు సురా సురేష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్,తిరుపతి జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ సిరాజ్ భాష,కంఠ ఉదయ్ కుమార్,సాయి తదితరులు పాల్గొన్నారు.

# : వైయస్ షర్మిళా రెడ్డి ని గృహనిర్బంధం చేయడం ప్రతిపక్షాలు గొంతు నొక్కడమే తలపా దామోదరం రెడ్డి



శ్రీకాళహస్తి రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ని హౌస్ అరెస్ట్ చేయడం ప్రతిపక్షాల గొంతు నొక్కడమేఅని కాంగ్రెస్ నాయకులు తలపా దామోధరం రెడ్డి పేర్కొన్నారు.ఉద్దండరాయుని పాలెంలో బుధవారం షర్మిల రెడ్డి పర్యటించాలని నిర్ణయించారన్నారు. ఈ క్రమంలోనే పీసీసీ అధ్యక్షురాలి నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారన్నారు.. 2015లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్దండరాయుని పాలెం వద్ద శంకుస్థాపన చేశారన్నారు.ఈ క్రమంలో ఈ ప్రాంతంలో పర్యటించాలని షర్మిల రెడ్డి నిర్ణయించగా.. అందుకు పోలీసులు ఆంక్షలు విధించారన్నారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి అప్రజాస్వామిక చర్యలు ప్రజాస్వామిక దేశంలో చెల్లవని అమరావతి రాజధాని లో అసలు ఏం జరుగుతుందో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వాలకు, ప్రతిపక్షాలకు ఎంతైనా అవసరం ఉందని కావున ఇటువంటి గృహనిర్బంధాలను కలుగజేసి ప్రజలను అయోమయంలోకి ప్రభుత్వాలు నెట్టివేస్తున్నాయి అని కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా ప్రజల వైపు పోరాటం చేస్తుందని ఇటువంటి చర్యలు సరికావని తెలియజేశారు

# సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో డీఎస్పి నర్సింహమూర్తి



శ్రీకాళహస్తి రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సూచనల మేరకు శ్రీకాళహస్తి మండలంలోని ఎంపేడు,ఈశ్వరయ్య ఎస్టి కాలనీ ల నందు సివిల్ రైట్స్ డే ని శ్రీకాళహస్తి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ అయిన కె.నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించి వారికి గల హక్కుల గురించి, నూతన చట్టాలను గురించి తెలియపరచి వారికి అన్ని ప్రభుత్వ శాఖల నుండి సరైన సహకారం అందుతుందా లేదా అని తెలుసుకోవడం జరిగింది. విద్య యొక్క ప్రాధాన్యత ప్రభుత్వం బడుగు బలహీన



వర్గాల, పేదరిక నిర్మూలన కోసం ఏ రకమైన పథకాలను ప్రవేశపెట్టి అమలుపరిస్తుందో తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎంపీడీవో రఫిక్ ఖాన్, శ్రీకాళహస్తి రూల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం.రవి నాయక్, శ్రీకాళహస్తి డిప్యూటీ తాసిల్దార్,ఏంపేడు పం,చాయతీ సెక్రెటరీ, తాడిపర్తి ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# : కార్మికులకు మే డే శుభాకాంక్షలు కోట చంద్రశేఖర్



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్): మే డే సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేసిన తెదేపా నాయి బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న తెదేపా ప్రభుత్వం తరపున కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలియపరచారు.

# కార్మికులకు మేడే శుభాకాంక్షలు : కలవగుంట భరత్ రెడ్డి



**శ్రీకాళహస్తి రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) :139 వ మే డే దినోత్సవాన్ని పురక్షరించుకోని కార్మికులకు ప్రముఖ సంఘ సేవకులు కలవగుంట భరత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల అపారమైన శ్రమను గౌరవిస్తామనీ వారి కష్టమే దేశ నిర్మాణానికి పునాదనీ అని పొడి ఎండలోనూ, వానలోనూ పనిచేసే వారి సహనమే అభివృద్ధికి మార్గని అన్నారు.మే డే రోజున వారి హక్కులు,గౌరవం కోసం గొంతెత్తుధాం అని చాలామంది బాల కార్మికులు వివిధ కర్మాగారాల్లో మగ్గుతున్నారని వారిని గుర్తించి ప్రభుత్వం వారికి సహాయ, సహకారాలు అందించి వారికి ఉజ్వల భవిష్యత్తును వారికి అందించాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.**

# పౌర హక్కుల చట్టాల గురించి వివరించిన డక్కిలి సబ్ ఇన్స్పెక్టర్ శివశంకర్




వెంకటగిరి నియోజకవర్గం ఇంచార్జ్ విసీ సుబ్బరాయుడు శుభోదయం న్యూస్ మండలంలోని లింగసముద్రం పంచాయతీలోని ఎస్టి కాలనీలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ రాజ్యాంగంలో దళిత, గిరిజనుల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా కులంపేరుతో వెలివేసినా, అంటరానివారిగా అవమానించినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పౌరుడు పుట్టినప్పటినుంచి మరణించే వరకు సహజంగా లభించే హక్కులు స్వేచ్ఛ జీవించుటకు మానవత్వం హక్కు ఈ విధమైన హక్కుల గురించి అశ్రుత్య నివారణ చట్టం గురించి ఎస్సీ ఎస్టీ చట్టం గురించి వివరించిన అనంతరం ఎల్లవేళలా ఎస్సీ ఎస్టీ దళిత కు ఎలాంటి సంఘటనలు జరిగిన మీకు ఎల్లవేళలా చట్టాలు అందుబాటులో ఉన్నాయని మీరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

# : విజయ ఢంఖ మోగించిన విజయ రత్నా విద్యార్ధులు... పది ఫలితాలలో మరోమారు ప్రభంజనం




మేడిపల్లి, ఏప్రిల్30 శుభోదయం రిపోర్టర్ - బైరెడ్డి సందీప్ రెడ్డి : రాష్ట్రం ప్రభుత్వం విడుదల చేసిన పది ఫలితాలలో విజయరత్న స్కూల్ విద్యార్ధులు విజయ దంఖా మోగించారని స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విజయరత్న స్కూల్ డైరెక్టర్స్ కె.విజయసేన రెడ్డి,ఎం.నరేంద్రనాధ్,ఎం.నర్సింహా రావు,కె.శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ ఉప్పల్, మేడిపల్లి,పీర్జాదిగూడ,ఘట్కేసర్ పరిధిలో స్కూల్స్‌విద్యార్ధులు పదవ తరగతి ఫలితాలలో విజయకేతనాన్ని ఎగురవేసి శిఖరాగ్రాన నిలిచిందని అన్నారు.బి.నివేధిత 590,కె.భార్గవ్ యాదవ్ 588,సిహెచ్.లక్ష్మణ్ 588,సిహెచ్.రోహిత్ దత్త 588,ఎ.సిరి588లతో పాటు 580-589 (15 మంది విద్యార్థులు),570-579 (27 మంది విద్యార్థులు),560-569 (21 మంది విద్యార్థులు),550-559 (15 మంది విద్యార్థులు),540 మార్కులకు పైన (106 మంది విద్యార్థులు),500 మార్కులకు పైన (175 మంది విద్యార్థులు) మంచి మార్కులు సాధించినట్లు తెలిపారు.యాజమాన్య విద్య వార్షిక ప్రణాళికబద్ధమైన నియమాల సరళి, ఉపాధ్యాయ బృందం సమిష్టి మేధాసంపత్తి,మొక్కవోని విద్యార్థుల సంకల్పం,కఠోర శ్రమ,క్రమశిక్షణతో కూడిన అభ్యసన వల్లనే సాధ్యమైందని కొనియాడారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం చేపట్టిన నిర్ణయాలకు అనుగుణంగా ప్రణాళిక,తగిన వ్యూహాలు, మూల్యాకనంలోని మార్పులు చోటుచేసుకున్న కూడా విద్యార్థులలోని నైపుణ్యాలను మెరుగుపరుచుకునే విధంగా యాజమాన్యం విద్యార్థులను తీర్చిదిద్దిందని అని తెలిపారు.విద్యార్థుల విజయానికి సహకరించిన తల్లిదండ్రులకు,విద్యార్థులకు పాఠశాల సిబ్బందికి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి కృత్షతలు తెలిపారు.

# విద్యుత్ షాక్ తో గురైన బాలుని వైద్యానికి.... ప్రీతం వర్షిత

## చారిటబుల్ ట్రస్ట్ 15 వేల రూపాయల ఆర్థిక సాయం




ఒంగోలు, శుభోదయం న్యూస్:ఈ ఏడాది సంక్రాంతి పండుగ నాడు గ్రామం శాంతినగర్ కాలనీకి చెందిన రాతికింద రవి నాగమలేశ్వరి చిన్న కుమారుడు హనీష్ తన స్నేహితులతో ఇంటిపై గాలిపటం ఎగురవేస్తూ సరదాగా ఆడుకుంటుండగా గాలిపటం కరెంట్ తీగల మీద పడటంతో తనకు తెలియకుండా అమాయకంగా ఇనుప చువ్వతో గాలిపటాన్ని తీయటానికి ప్రయత్నించినప్పుడు ఒక్కసారిగా విద్యుత్తు ప్రసరించి బాలుడు హనీష్ కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో కుడి చెయ్యి కోల్పోవాల్సి వచ్చింది. అప్పటినుండిమంచానికే పరిమితమైన హనీష్ బాగోగులు తల్లిదండ్రులు అన్ని పనులు మానేసి చూసుకుంటున్నారు. ఇప్పటికే వైద్యానికి పది లక్షలకు పైగా ఖర్చు అయ్యాయి. రెక్కాడితే కాని డొక్కాడని ఆ చిన్న కుటుంబం బిడ్డకు అలా కావడంతో ఒక్కసారిగా ఏం చేయాలో తోచక అబ్బాయిని కనిపెట్టుకొని ఇంటి వద్ద ఉంటున్నారు. ఆర్థికంగా బాగా చితికిపోయారు. వీరి స్థితిని గమనించిన ప్రీతం వర్షిత హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ నిర్వాహకులు కొమ్మి రమణయ్య వారి సతీమణి రాజేశ్వరి ఇద్దరూ వైద్య ఖర్చులకోసం తమ ట్రస్టు తరపున 15 వేల రూపాయల చెక్కును వారికి అందజేశారు. ఇంకా మరింత సాయం అందించేందుకు వారు సుముఖత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు, సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొల్లా మధు,సినీ నటులు దన్నారపు మస్తాన్రావు తదితరులు పాల్గొన్నారు.

# నేటి తరానికి బసవేశ్వరుని బోధనలు అందరికీ ఆదర్శప్రాయమైనవి.. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

తరానికి బసవేశ్వరుని బోధనలు ఆదర్శప్రాయమైనవి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారము బసవేశ్వరుని జయంతి సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్ లో గల బసవేశ్వరుని విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తుల జీవితాలను సమాజ గమనాన్ని ప్రభావితం చేసే విధంగా బసవేశ్వరుడు తన స్వంత ఒరవడిలో కొత్త ధర్మాన్ని సృష్టించారని, అదే లింగాయత్ ధర్మమని, అనాదిగా వస్తున్న మూఢ నమ్మకాలను, ఆచారాలను బసవేశ్వరుడు తీవ్రంగా ఖండించారన్నారు. పూర్వం స్త్రీలకు, అనగారిన వర్గాలకు ధార్మిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులు ఉండేవి కావని, బసవేశ్వరుని ఆగమనంతో అందరూ అన్ని బంధాల నుండి విముక్తి పొందారన్నారు.వర్గ, వర్ణ, లింగ భేదాలను తెంచి ఒక నూతన సమ సమాజాన్ని ఆయన స్థాపించారని ఆయన అన్నారు. సమాజ నిర్మాణంలో ఆయన దార్శనికత నాయకత్వం ఇన్ని శతాబ్దాల తర్వాత కూడ స్ఫూర్తినిస్తూనే ఉన్నాయన్నారు. బసవేశ్వరుడు సమ సమాజ స్థాపనకై దేవుడినే భక్తుడి వద్దకు తీసుకు రావడానికి ఇష్టలింగాన్ని కనిపెట్టారని, పరమ శివునికి ప్రతిరూపమైన ఇష్ట లింగాన్ని చేతికిచ్చి గుడి సంస్కృతిని, కుల వ్యవస్థను అంతమొందించారని ఆయన అన్నారు. అగ్రవర్ణాల వారు నిమ్న జాతుల వారిని , అనగారిన వర్గాల వారిని గుడిలోనికి రానివ్వనపుడు ఆ గుడిలోని లింగాన్ని తెచ్చి వారి ఒడిలోన ఉంచిన మహనీయుడు బసవేశ్వరుడని, నేడు మనం ఆచరించే యోగాని ఆనాడే ఆయన తన ఇష్టలింగ పూజలో జత చేశారని గుర్తు చేశారు. మాంసాహారాన్ని త్యజించి శాకాహారాన్ని స్వీకరించడం ఇష్టలింగాదరణ, ఇష్టలింగ పూజ. ఇదే బసవేశ్వరుడు సూచించిన భక్తి మార్గమని, సామాజిక వ్యవస్థలో సమానత్వం ఉండాలని మనుషులు మధ్య మతాల మధ్య సామరస్యం ఉండాలని ఆకాంక్షించిన ఆయన కుల మతాల మధ్య భేదాలను తెంచి ధార్మిక రాజకీయ ఆర్థిక హక్కులను కల్పించి నూతన సమసమాజ ఒరవడికి శ్రీకారం చుట్టి నేటి ఈ సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయేందిర బోయి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సిజే బెనహర్, గుండా మనోహర్, ప్రవీణ్ కుమార్ బిసి సంక్షేమ శాఖ అధికారి ఆర్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ పర్యటన వేళ .. వర్ష భయం



తుళ్లూరు (గుంటూరు) : ప్రధాని మోడీ రాజధాని అమరావతి పర్యటన వేళ .. వర్ష భయం వెంటాడుతోంది. ఆకాశంలో దట్టమైన మేఘాలు ప్రభుత్వానికి, అధికారులకు గుబులు పుట్టిస్తున్నాయి. మే 2న రాజధాని నిర్మాణ పనుల పున్ణ ప్రారంభానికి మోడీ అమరావతికి రానున్నారు. పలు అభివఅద్ధి పనులను ప్రధాని ప్రారంభిస్తారు. అనంతరం సచివాలయం వెనుక రహదారి పక్కన జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సభకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 5 లక్షల మంది ప్రజలు తరలివస్తారని అంచనా వేస్తున్నారు. ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. రహదారులు, పార్కింగ్, తాగునీరు, ఆహారం, వైద్య సౌకర్యం కల్పించడం, తదితర ఏర్పాట్లను చేస్తోంది. మంత్రులు, ఉన్నతాధికారులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పనులు బుధవారం సాయంత్రానికి పూర్తవుతాయని చెబుతున్నారు. ఎదురుచూస్తున్న సమయం సమీపిస్తుండడం, పనులు కొలిక్కి వస్తున్న వేళ వర్ష భయం వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం పురపాలక, పట్టణాభివఅద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఏర్పాట్లను మరోసారి పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితులను, వర్షం కురిస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ వర్షం వస్తే ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. అందుకు అనుగుణంగా 7 వేల బస్సులు, 3 వేల కార్లకు పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజధానిలో మట్టి నేలలు కావడంతో సి ఆర్ డి ఎ నిర్మించిన తారురోడ్ల పై వాహనాలను పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇతరత్రా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు.

# ఏపీలో నేటి నుంచి వాళ్లకు రేషన్ బంద్?



**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ కార్డులు ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం బిగ్ అలర్ట్ జారీ చేసింది. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఇవాళ సాయంత్రం లోపు ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపింది. ఈకేవైసీ పూర్తి చేయకుంటే ప్రభుత్వ పథకాలు నిలిచిపోయే అవకాశం ఉందని తెలిపింది. ఐదేళ్ల లోపు పిల్లలు, 80 ఏళ్ల పైబడిన వృద్ధులకు కేవైసీ అవసరం లేదని స్పష్టం చేసింది. గడువు మరోసారి పొడిగించే అవకాశం లేదని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డు ఉన్నవారు ఈ-కేవైసీ చేసుకోవడానికి రేషన్ షాపులు, మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ ఆపరేటర్లు, డిప్యూటీ తహశీల్దార్లు, తహశీల్దార్లు, పౌరసరఫరాల శాఖ అధికారి కార్యాలయాల్లో ఈ సదుపాయం కల్పించారు గతంలో చాలా మంది ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, వేరే ప్రాంతాల్లో చదువుకుంటున్నవాళ్లు, అలాగే పరీక్షల వల్ల ఈకేవైసీ చేసుకోలేకపోయారు. వాస్తవానికి మార్చి 31న గడువు ముగియగా.. ప్రజల ఇబ్బందుల్ని గమనించి ఆ గడువును ఈ నెల 30 వరకు పొడిగించింది. ఇటీవల చాలా మంది రేషన్ కార్డుదారులు చనిపోయారు.. వారి పేర్లను ఇంకా తొలగించలేదు. చాలా మంది చిరునామాలు కూడా మారిపోయాయి.. అందుకే ఈకేవైసీ తప్పనిసరి చేశారు. అడ్రస్ మారినప్పటికీ, రేషన్ ఎక్కడ తీసుకుంటున్నారో అక్కడే ఈకేవైసీ చేయించుకోవచ్చు అని ప్రభుత్వం తెలిపింది.

# అంగన్వాడీ చిన్నారులకు వేసవి సెలవులు ప్రకటన..!



**హైదరాబాద్, :** రాష్ట్రంలోని అంగన్వాడీ చిన్నారులకు మంత్రి సీతక్క ఆదేశాల మేరకు నెల రోజుల పాటు సెలవులు ప్రకటించారు. తల్లిదండ్రులు, అంగన్వాడీ యూనియన్ల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్ లో బుధవారం నాడు అంగన్వాడీ యూనియన్లతో డైరెక్టర్ కాంతి వెస్లీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో మే 1 నుంచి సెలవులు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే అంగన్వాడీ లబ్దిదారులకు పౌష్టికాహారం అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అంగన్వాడీ చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు టేక్ హెూం రేషన్ ద్వారా గుడ్లు, సరుకుల సరఫరా చేయనున్నారు. సెలవుల కాలంలో అంగన్వాడీ టీచర్లకు ఇతర విధులు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటింటి సర్వే, హెూం విసిట్స్, అంగన్వాడీలో చేర్చే చిన్నారుల గుర్తింపు వంటి విధులను విధిగా నిర్వర్తించాలని టీచర్లకు ఆదేశాలు జారీ చేసారు. ఈ ప్రభుత్వ నిర్ణయంతో వేసవి నుంచి లబ్దిదారులకు, సిబ్బందికి కాస్త ఉపశమనం లభించనుంది. అంగన్వాడీ చరిత్రలోనే తొలి సారిగా సెలవులు ఇవ్వడంతో, త్వరలో ఉత్తర్వులు ఇవ్వనునట్లు అధికారులు తెలిపారు. అంగన్వాడీలకు సెలవులు ప్రకటించిన ప్రభుత్వానికి, చొరవ చూపిన మంత్రి సీతక్కకు అంగన్వాడీ యూనియన్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాయి.

# మండుతున్న భూగోళం



హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా ఈ వారంలో 21 దేశాల్లో 110 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఇసిఎండబ్ల్యుఎఫ్ అంచనా వేసింది. వాటిల్లో పాకిస్తాన్, ఇరాన్, కువైట్, సౌదీ అరేబియా, మౌరిటానియా, ఇండియా, ఇరాక్, ఖతార్, సూడాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్, దక్షిణ సూడాన్, బహ్రెయిన్, మాలి, సెనెగల్, చాడ్,ఇథియోపియా, నైజర్, ఎరిట్రియా, నైజీరియా, బుర్కినా, ఫాసోలు దేశాలు ఉన్నాయి. బుధ, గురువారాల్లో 49 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఇసిఎండబ్ల్యుఎఫ్ (యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం-రేంజ్ వెదర్ ఫోర్కాస్ట్స్) నివేదిక తెలిపింది. ఈ వారాంతానికి రెండు మూడు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరిగి 50 డిగ్రీల మార్కు దాటే అవకాశం ఉందని ఎసిఎండబ్ల్యుఎఫ్ అంచనా వేసింది. ఇక చైనాలో కూడా వేడిగాలులు వీచే అవకాశం ఉందని తుర్క్మెనిస్తాన్, ఉజ్బెకిస్తాన్లలో 38 డిగ్రీల కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయని ఇసిఎండబ్ల్యుఎఫ్ పేర్కొంది.పాకిస్తాన్లో ఎండలు మండుతున్నాయి. ఆ దేశంలో గత వారంలో దక్షిణ పాకిస్తాన్లో 48 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని.. బహుశా 50 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పాకిస్తాన్ వాతావరణ శాఖ అంచనా వేసింది. బహుశా ఈ ఏడాది కూడా 50 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వాషింగ్టన్ పోస్టు సూచించింది.

# సృజనాత్మక ఆర్థిక వ్యవస్థతో ఉపాధికి ఊతం



ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు శరవేగంగా మారుతున్నాయి. ఒకప్పుడు వ్యవసాయం, పరిశ్రమలే ఆర్థిక ప్రగతికి మూలస్తంభాలుగా నిలిచాయి. ఆ తర్వాత సేవల రంగం, సమాచార సాంకేతిక విప్లవం ఆర్థికాధిపత్యాన్ని చలాయించాయి. నేడు, 21వ శతాబ్దంలో, మానవ మేధస్సు, కల్పనాశక్తి, ప్రత్యేక ప్రతిభల సమ్మేళనమైన సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ ఒక నూతన శక్తిగా ఆవిర్భవిస్తోంది. ఇది కేవలం కళలు, సంస్కృతికి పరిమితమైనది కాదుబీ ఆర్థికాభివృద్ధికి ఒక బలమైన చోదకశక్తిగా, లక్షలాది మందికి ఉపాధి కల్పించే విస్తృత వేదికగా, అంతర్జాతీయంగా భారతదేశ ప్రతిష్ఠను పెంపొందించే ఒక మహత్తర సాధనంగా ఇది పరిగణించబడుతోంది. అపారమైన సాంస్కృతిక సంపద, ప్రాంతీయ వైవిధ్యం, యువ జనాభా కలిగిన భారతదేశానికి ఈ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ ఒక అద్భుతమైన అవకాశాలనిధి. అయితే, ఈ సువర్ణావకాశాన్ని మనం ఎంతవరకు అందిపుచ్చుకోగలుగుతున్నామనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన విషయం. సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ అంటే వ్యక్తిగత సృజనాత్మకత, ప్రత్యేక నైపుణ్యం, అంతర్గత ప్రతిభల ఆధారంగా వృద్ధిచెందే విభిన్న పరిశ్రమల సమూహం. ఇది మేధోసంపత్తిని ఉపయోగించి ఆర్థిక విలువను సృష్టిస్తుంది. హస్తకళలు, చిత్రలేఖనం, శిల్పం, మ్యూజియంలు, చారిత్రక ప్రదేశాలు, సంగీతం, నృత్యం, నాటకం, మీడియా, సినిమాలు, యానిమేషన్, డిజైన్, ప్రకటనలు, సాఫ్ట్‌వేర్, గేమింగ్ వంటి అనేక రంగాలు ఇందులో అంతర్భాగంగా ఉన్నాయి.డిజిటల్ విప్లవం, ఇంటర్నెట్ వ్యాప్తి ఈ ఉత్పత్తులు, సేవలు ప్రపంచవ్యాప్తంగా వేగంగా చేరుకోవడానికి మార్గం సుగమం చేశాయి. ఈ రంగాలు పరస్పరం అనుసంధానమై ఆర్థిక విలువను పెంపొందిస్తున్నాయి. ప్రపంచ గణాంకాల ప్రకారం, సృజనాత్మక సేవల వాణిజ్యం 2022లో $1.4 ట్రిలియన్లకు చేరుకుంది. సృజనాత్మక వస్తువుల ఎగుమతులు $713 బిలియన్లు. ఈ రంగం ప్రపంచవ్యాప్తంగా $ 2 ట్రిలియన్ల ఆదాయాన్ని, 50 మిలియన్ల ఉద్యోగాలను సృష్టిస్తోంది. సాఫ్ట్‌వేర్, పరిశోధన -అభివృద్ధి, ప్రకటనలు ముఖ్యమైన సహకారులుగా ఉన్నాయి. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు ఈ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నాయి. భారతదేశానికి ఇది ఒక ప్రత్యేకమైన అవకాశం. మన సాంస్కృతిక వారసత్వం, యువత దీనికి ప్రధాన బలం. భారత సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ విలువ ప్రస్తుతం $ 30 బిలియన్లు. ఇది మన జిడిపికి 2.5% తోడ్పడుతుంది. 8% మందికి ఉపాధి కల్పిస్తుంది. ఇన్ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ వంటి చిన్నరంగం కూడా వేల కోట్ల రూపాయల విలువ కలిగి ఉంది. గౌహతి, కొచ్చి వంటి నగరాలు సృజనాత్మక కేంద్రాలుగా ఎదుగుతున్నాయి. ఇది గ్రామీణ కళాకారులకు ఉపాధినిస్తుంది, పర్యాటకాన్ని ప్రోత్సహిస్తుంది, ఎగుమతులను పెంచుతుంది, దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తుంది. అయినప్పటికీ, ఈ రంగం ఇంకా పూర్తిగా వ్యవస్థీకృతం కాలేదు. సమగ్ర జాతీయ విధానం కొరవడింది. చిన్నసంస్థలకు పెట్టుబడి లభించడం కష్టంగా ఉంది. పైరసీ, మేధో సంపత్తి ఉల్లంఘనలు సృజనకారుల ఆదాయాన్ని దెబ్బతీస్తున్నాయి. సరైన మౌలిక సదుపాయాలు, డిజిటల్ నైపుణ్యాల కొరత వేధిస్తోంది. మార్కెటింగ్, బ్రాండింగ్ సమస్యలు ఉన్నాయి. ఈ రంగంపై సమగ్రమైన గణాంకాల కొరత విధాన రూపకల్పనకు ఆటంకం కలిగిస్తోంది. ఈ సవాళ్లను అధిగమించడానికి, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను ఒక కీలక రంగంగా గుర్తించి సమగ్ర జాతీయ విధానాన్ని రూపొందించాలి. ప్రత్యేక నిధులు, సులభ రుణాల వ్యవస్థను ఏర్పాటు చేయాలి. కఠినమైన చట్టాలతో పైరసీని అరికట్టాలి. సృజనాత్మక కేంద్రాలు, డిజిటల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలి. డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ అందించాలి. ఉత్పత్తుల ప్రదర్శనకు వేదికలు కల్పించాలి. సమగ్ర డేటా సేకరణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. భవిష్యత్తులో సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ మరింత కీలక పాత్ర పోషించనుంది. డిజిటలైజేషన్, కృత్రిమ మేధస్సు వంటి సాంకేతికతలు కొత్త అవకాశాలు సృష్టిస్తాయి. భారతదేశం తన సాంస్కృతికశక్తిని, యువత నైపుణ్యాలను ఉపయోగించి ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు. ఇది ఆర్థికవృద్ధితో పాటు సామాజిక సమ్మిళితానికి, ప్రాంతీయ అభివృద్ధికి, దేశ 'సాఫ్ట్ పవర్'కు తోడ్పడుతుంది. 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవడంలో సృజనాత్మక రంగం ఒక కీలక చోదకశక్తిగా నిలవగలదు. ఈ దిశగా మనం సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అడ్డూఆపూ లేని అవినీతి!



అవినీతిపై ప్రభుత్వాల పోరాటం ఎప్పుడు మొదలైందో తెలియదు గానీ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా, ఆ పోరాటం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. పుట్టలకొద్దీ వెలుగుచూస్తున్న అవినీతిపరుల బాగోతాన్ని చూస్తుంటే, మన నేతల చేతలు మాటలకే పరిమితమవుతున్నాయని అనిపించకమానదు. పత్రికల్లో పతాక శీర్షికలకు ఎక్కుతున్న అవినీతిపరుల నిర్వాకాన్ని చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. మొన్నటికి మొన్న వందకోట్ల అవినీతి తిమింగలాన్ని అవినీతి నిరోధక శాఖ అరెస్ట్ చేసిందన్న వార్త తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును పర్యవేక్షించిన ఓ ఉన్నతాధికారిపై ఎసిబి జరిపిన దాడుల్లో దాదాపు వంద కోట్ల రూపాయల విలువైన అక్రమాస్తులు బయటపడ్డాయి. సదరు మహాశయుడు భారీయెత్తున పొలాలు, విల్లాలు, నగానట్రా సమకూర్చుకున్నట్లు వెల్లడైంది. సోదాలు ఇంకా జరుగుతున్నందున ఈ ఆస్తుల విలువ ఎంతకు చేరుతుందో అంచనా వేయలేం. ఈ కేసులో నిజానిజాలు ఎలా ఉన్నా, పత్రికల్లో వచ్చిన ఈ వ్యవహారాన్ని చూసి, ఈ దేశంలో అవినీతి ఎప్పుడు అంతమవుతుందోనని సామాన్య జనం నిట్టూర్పు విడిచి ఉండవచ్చు. కానీ, అవినీతికి చిరునామాగా మారిన రాజకీయ వ్యవస్థ మారనంతకాలం అవినీతిని దేశంనుంచి పారదోలడం అత్యాసే అవుతుందని మాత్రం ఘంటాపథంగా చెప్పవచ్చు. దేశంలో పెచ్చుమీరుతున్న అవినీతి గురించి సర్వోన్నత న్యాయస్థానం సైతం పలు సందర్భాల్లో ఆందోళన వెలిబుచ్చినా మన నాయకమ్మన్యులలో చలనం మాత్రం కలగడం లేదు. పటుతరమైన చట్టాలు చేసి, అవినీతిపై ఉక్కుపాదం మోపి అందరికీ ఆదర్శంగా నిలవాల్సిన రాజకీయ నేతలే కాసులకు కక్కుర్తిపడి, దేశ భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారు. అవినీతిని అరికడతామంటూ ప్రతినలు పలికే నేతలు ఆచరణలో అందుకు పూర్తి విరుద్ధంగా ప్రవర్తించడం దౌర్భాగ్యం కాక మరేమిటి? అవినీతి కేసులలో ఇరుక్కుని బెయిల్ పై బయటకు వచ్చినవారే అక్రమాలను అరికడతామంటూ ప్రగల్భాలు పలుకుతుంటే నమ్మడం ఎలాగంటూ సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీయే ఒక సందర్భంలో ఆక్రోశం వెలిబుచ్చారంటే రాజకీయాలు నైతికంగా ఎంతగా పతనమయ్యాయో అర్థం చేసుకోవచ్చు. లోక్‌సభకు కొత్తగా ఎన్నికైనవారిలో 251 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఆ మధ్య అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫారమ్స్ సంస్థ చేపట్టిన అధ్యయనంలో తేలడం ఇందుకు మరో ఉదాహరణ. ఆ మాటకొస్తే, అవినీతిని అరికట్టేందుకు మనకు ఉన్న సంస్థలు, చట్టాలు బోలెడు. అవినీతి నిరోధక శాఖ, కేంద్ర దర్యాప్తు సంస్థ, ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ వంటి సంస్థలు, అవినీతి నిరోధక చట్టం, ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్, ప్రజావేగుల చట్టాలు, సమాచార హక్కు చట్టం వంటివి అనేకం ఉన్నా, అవినీతి అణువైనా తగ్గకపోవడానికి కారణాలు అనేకం. దర్యాప్తు సంస్థలు ఎంతో శ్రమించి అవినీతిపరులను గుర్తించి అరెస్టు చేస్తున్నా, ఆయా కేసులలో శిక్షపడుతున్నది కొద్దిమందికి మాత్రమేనంటే ఆశ్చర్యం కలుగకమానదు. చట్టాలలోని లొసుగులు, న్యాయస్థానాల్లో ఏళ్లూపూళ్లూ పడుతున్న విచారణ, సరైన సాక్ష్యాధారాలు చూపలేకపోవడం వంటివి ఇందుకు కొన్ని కారణాలుగా చెప్పుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే జనాభాతో కిటకిటలాడే ఆసియా దేశాలలో అవినీతి మరీ పెచ్చరిల్లిపోతోంది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ విడుదల చేసిన ర్యాంకుల్లో మొత్తం 180 దేశాల జాబితాలో భారత దేశానిది 96వ స్థానం. ఈ ర్యాంకు ఏ ఏటికాయేడు అంతకంతకు దిగజారిపోతూ ఉండటం మరీ సిగ్గుచేటు. ఇక పాకిస్తాన్ వంటి దేశాల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ప్రపంచవ్యాప్తంగా ఏటా ట్రిలియన్ డాలర్లు అవినీతిపరుల ఖాతాల్లోకి చేరుతోందంటూ ఆ మధ్య ఐక్యరాజ్య సమితి సైతం ఆందోళన వెలిబుచ్చింది. అవినీతికి అడ్డుకట్ట వేయగలిగితే ప్రభుత్వాలకు మరింత ఆదాయం సమకూరుతుందనడంలోనూ, ప్రజల జీవితాలు మెరుగుపడతాయనడంలోనూ సందేహం లేదు. అయితే పిల్లిమెడలో గంట ఎవరు కడతారన్నదే ప్రశ్న. అవినీతి నిర్మూలన ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. ప్రజలూ కీలక పాత్ర పోషించవలసిందే. అవినీతికి తాము దూరంగా ఉండటంతోపాటు అవినీతిపరులను ఎక్కడికక్కడ నిలదీయగలగాలి. ప్రజాచైతన్యం రగిలితే అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెడతాయి. అదే సమయంలో ప్రభుత్వాలు చట్టాలలోని లొసుగులను సవరించి, చట్టాలను లోపరహితంగా రూపొందించాలి. అవినీతిపరులకు కఠిన శిక్షలు విధించేలా చట్టాలను సవరించాలి. ప్రభుత్వ కార్యకలాపాలను వీలైనంతవరకూ ఆన్‌లైన్ విధానం ద్వారా నిర్వహిస్తే అవినీతికి ఆస్కారం ఉండదు. బొగ్గు గనులను వేలం వేసేందుకు ఆన్‌లైన్ విధానం తీసుకురావడం వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం సమకూరిందన్న వాస్తవాన్ని విస్మరించకూడదు.

# మానవత్వానికి పట్టంగట్టిన మహనీయుడు



850 సంవత్సరాల క్రితమే ప్రజాస్వామ్య జ్యోతి ప్రగల్భింపజేసిన మహాత్ముడి కథ ఇది! అపూర్వ ప్రజాస్వామ్యవాది మహాత్మా బసవేశ్వరుడు, సమానత్వ జ్యోతిగా, సామాజిక న్యాయ గర్జనగా చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిన సామాజిక విప్లవకారుడు, విశ్వగురు, మహా మానవతావాది, సంఘ సంస్కర్త. 12వ శతాబ్దంలో కుల, మత, వర్గ, వర్ణ వ్యవస్థలకు వ్యతిరేకంగా గళమెత్తి, స్త్రీ-పురుష అసమానతలను తొలగించడానికి కృషి చేసిన అభ్యుదయవాది. భారతదేశ మానవ హక్కుల చరిత్రలో తొలిపేజీని రాసిన గొప్ప మహనీయుడు, మానవ కల్యాణం కోసం స్వతంత్ర సమాలోచనలు చేసిన మొదటి వ్యక్తి, మూఢాచారాలను ధిక్కరించిన ధీరుడు, అనుభవ మంటపం ద్వారా ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిన మార్గదర్శకుడు. 'దేహమే దేవాలయం,' 'చేసే పనే దైవం' వంటి సందేశాలతో మానవతా విలువలను ప్రపంచానికి ప్రసాదించారు. కుల, మత, లింగ, వర్గ భేదాలతో కూడిన సమాజంలో అసమానతలను సవాలు చేస్తూ,, ఆయన రగిలించిన సామాజిక సంస్కరణ జ్యోతి నేటికీ స్ఫూర్తినిస్తోంది. 1134లో కర్ణాటకలోని బాగవాడి గ్రామంలో శైవ బ్రాహ్మణ కుటుంబంలో మాదిరాజు, మాదాంబిక దంపతులకు జన్మించిన బసవన్న బాల్యంలోనే మూఢాచారాలను ప్రశ్నించాడు. ఎనిమిదో ఏట ఉపనయనం చేయాలన్న తండ్రి మాటను తిరస్కరించి, అక్క నాగాంబిక వద్ద గురుకులంలో వేద శాస్త్రాలు, పురాణాలు, సాహిత్యం, గణితం, సంగీతం వంటి విద్యలలో ప్రావీణ్యం సంపాదించాడు. బిజ్జల చక్రవర్తి కొలువులో చేరి, మేనమామ బలదేవర కుమార్తెను వివాహమాడి, ప్రధానమంత్రి పదవికి ఎదిగాడు. నీతి, నిబద్ధత, సమాజసేవల ద్వారా ధర్మ పరిపాలనను ముందుకు నడిపించాడు. 12వ శతాబ్దంలో బసవన్న స్థాపించిన అనుభవ మంటపం ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి ప్రజాస్వామ్య వేదికగా నిలిచింది. కుల, మత, లింగ, వర్గ భేదాలకు అతీతంగా, స్త్రీలు, దళితులు సమానంగా చర్చల్లో పాల్గొన్నారు. 'ప్రతి మనిషి ఒక ఓటు' సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టారు. మహిళలు వేదాలు బోధించి, నిర్ణయ ప్రక్రియలో కీలక పాత్ర పోషించారు. ఇష్టలింగ ధారణ ద్వారా ఆధ్యాత్మిక సమానత్వాన్ని నెలకొల్పారు. అస్పృశ్యతను సవాలు చేసిన ఈ వేదిక నేటి పార్లమెంట్‌లకు స్ఫూర్తిగా నిలుస్తుంది. బసవేశ్వరుడు స్థాపించిన లింగాయత ధర్మం సమానత్వం, న్యాయానికి ప్రతీక. 'శ్రమే పూజ, కాయకమే కైలాసం' సిద్ధాంతంతో బాల్య వివాహాలు, సతీసహగమనం, నరబలి, పశుబలి వంటి మూఢాచారాలను నిర్మూలించారు. ఇష్టలింగ ధారణ ద్వారా ప్రతి భక్తుని స్వాతంత్ర్యాన్ని, కులాంతర వివాహాలను, దళితుల ఆలయ ప్రవేశాన్ని ప్రోత్సహించారు. 'పుట్టుకతో కాదు, కర్మతో గొప్పతనం' అంటూసమానత్వాన్ని బలపరిచారు. నిరాకార శివుడే సర్వేశ్వరుడని, శివతత్వ ప్రచారంతో లింగాయత ధర్మానికి బీజం వేశారు. శాఖాహారాన్ని స్వీకరించి, సహజ శివయోగాన్ని ప్రసరింపజేశారు. బసవేశ్వరుడు 64 లక్షలకు పైగా వచనాలు రాసినప్పటికీ, కొన్ని వేలు మాత్రమే లభ్యమవుతున్నాయి. 'కాయకమే కైలాసం', 'జ్ఞానమే గురువు' వంటి వచనాలు కుల వ్యవస్థను ఛేదించి, ప్రేమ, సమానత్వం, న్యాయ విలువలను వ్యాప్తి చేశాయి. ఈ వచనాలు మానవతా మార్గాన్ని చూపాయి, సమాజాన్ని సరిదిద్దాయి, ధర్మం అంటే నిజాయితీ అని బోధించాయి. అన్ని భాషలలో అనువదించి, ఈ వచనాలను నేటి తరానికి అందించాలి. తెలంగాణ ప్రభుత్వం బసవ జయంతిని అధికారికంగా జరుపుతూ, ట్యాంక్ బండ్‌పై విగ్రహం స్థాపించి, వీరశైవ లింగాయత కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు వీరశైవ లింగాయతుల సర్వతోముఖ అభివృద్ధి కోసం కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి, యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. బసవ చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చడం, బీసీ జాబితాలో వీరశైవ లింగాయతులను చేర్చడం కాంగ్రెస్ ప్రభుత్వ ఘనత. భారత ప్రభుత్వం పార్లమెంట్ ప్రాంగణంలో బసవేశ్వరుని విగ్రహాన్ని, 2006లో 5, 100 రూపాయల నాణాలను విడుదల చేసింది. డాక్టర్ నీరజపాటిల్ కృషితో లండన్‌లో ప్రధాని మోడీ గారి చేతుల మీదుగా విగ్రహం ఆవిష్కరించబడింది.

